విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలి
- కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీలో ఐటీడీఏ పీవో
- సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్‌తో కలిసి పర్యటన
- వసతులు, విద్యార్థినుల సమస్యలపై ఆరా
- సౌకర్యాల కల్పనకు రూ.10లక్షలు మంజూరు

6



భద్రాచలం వద్ద పూర్తిగా నీట మునిగిన స్నానఘట్టాలు
గోదావరి ఉధృతి

వరద తగ్గేదెలా?

- భద్రాద్రి వద్ద అంచనా కన్నా అధికంగా గోదావరి ప్రవాహం
- వాస్తవ నీటి మట్టానికి అదనంగా 4 అడుగులు చూపుతున్న వైనం
- ఎగువన ఉధృతి తగ్గినా.. కిందకు వెళ్లలేక నిలుస్తున్న వరద
- పోలవరం బ్యాక్ వాటరే కారణమంటున్న ఇంజనీరింగ్ నిపుణులు

భద్రాచలం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఎగువ భాగాన కురిసిన భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం గురువారం 51.9 అడుగులుగా నమోదైంది. అయితే వాస్తవానికి అధికారుల అంచనాల ప్రకారం.. ఈ నీటిమట్టం నాలుగు అడుగులు అధికంగా ఉన్నట్లు సమాచారం. దీనికి ప్రధాన కారణం పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావమేనని ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రం 4 గంటలకు 51.9 అడుగులకు రాగా.. 6 గంటలకు సైతం ఇంకా నిలకడగానే ఉంది.

ఎగువ భాగం నుంచి భద్రాచలానికి 11.50 లక్షల క్యూసెక్కుల నుంచి 12 లక్షల క్యూసెక్కుల వరకు వరద నీరు రావడం జరిగింది. అయితే బ్యాక్ వాటర్ ప్రభావంతో 14 లక్షల క్యూసెక్కుల వరద నీరు భద్రాచలం వద్ద పరిస్థితి కనిపిస్తోందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో తాజాగా పరిస్థితులతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే భవిష్యత్తులో భద్రాచలంకు ముప్పు పొంచి ఉందనే వ్యాఖ్యలు వాస్తవ రూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, తదనంతర పరిణామాలపై ఇప్పటికే క్షేత్రస్థాయిలో తీవ్ర చర్చ సాగుతోంది.

2022 నుంచి భద్రాద్రిలో ఇదే సమస్య పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 70 శాతం వరకు పూర్తి కావడంతో భద్రాచలం వద్ద వరదల సమయంలో వరద నీరు కిందకు వెళ్లడం సమస్యగా మారుతోంది. ఏపీ అధికారులు పోలవరానికి వచ్చే వరద నీటిని పట్టిసీమ, కృష్ణా కెనాళ్లకు మళ్లిస్తుండడంతో.. భద్రాచలం వద్ద రోజుల తరబడి వరద నీరు తగ్గకుండా నిలిపోతున్న సందర్భాలు ఉంటున్నాయి. 2022, జూలై 17న 71.3 అడుగుల వరద నమోదైతే.. నీటిమట్టం 30 అడుగుల సాధారణ స్థాయికి తగ్గేందుకు రెండు నెలల వరకు పట్టింది. గత మూడేళ్ల కాలంలో సైతం వరదల సమయంలో నీరు పెరిగినంత వేగంగా తగ్గకపోవడంతో భద్రాచలం నుంచి ఎగువన ఉన్న మండలాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ సమస్యపై ఆంధ్ర నీటిపారుదల అధికారులు సైతం ఇరు రాష్ట్రాల సమావేశాలు జరిగిన సమయంలో చర్చిస్తున్నా.. పరిష్కార మార్గం మాత్రం లభించడం లేదు.



ఏళ్లుగా భయం గుప్పిట్లోనే భద్రాద్రి వాసులు

భద్రాచలం వద్ద వర్షాకాలం సీజన్‌లో వరద వస్తుంటే ఎలాంటి నష్టం జరుగుతుందోననే ఆందోళన నదీ పరివాహక ప్రాంత వాసుల్లో వ్యక్తమవుతూ ఉంటుంది. భద్రాచలం వద్ద 1986, ఆగస్టు 16న గరిష్ఠంగా 75.6 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఈ సమయంలో 27.02 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించింది. ఇదే ఇప్పటి వరకు అత్యధిక నీటిమట్టంగా పేర్కొనవచ్చు. 2022 జూలై 16న భద్రాచలం వద్ద 71.3 అడుగుల నీటిమట్టం నమోదు కాగా.. ఆ సమయంలో భద్రాచలం నుంచి దిగువ ప్రాంతానికి 24.43 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించింది. 32 ఏళ్ల అనంతరం ఇంత భారీగా నీటిమట్టం భద్రాచలం వద్ద నమోదైంది. అయితే పోలవరం బ్యాక్ వాటర్‌తో భద్రాచలం, బూర్గంపాడు, దుమ్ముగూడెం తదితర మండలాల వాసులకు ముంపు ముప్పు పొంచి ఉందనే వ్యాఖ్యలు వాస్తవంగా ఇటీవల క్షేత్రస్థాయి పరిస్థితుల ద్వారా తెలుస్తోంది.

క్రమంగా తగ్గుతూ...

- 51.4 అడుగులకు చేరిన గోదావరి
- 51.9 అడుగుల వద్ద 5 గంటలపాటు నిలకడగా..
- భద్రాచలం వద్ద కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- తెలంగాణ-ఏపీ సరిహద్దుల్లో రాయనిపేట వద్ద నిలిచిన రాకపోకలు
- పూర్తిగా నీట మునిగిన కల్యాణకట్ట దిగువ భాగం
- స్నానఘట్టాల మెట్ల మీదే పితృ తర్పణాలు
- పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం, సబ్‌కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ


కల్యాణ కట్ట కిందిభాగాన్ని తాకుతూ ప్రవహిస్తున్న వరద నీరు

భద్రాచలం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురిసిన భారీ వర్షాలు, వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుతో పాటు ఇంద్రావతి, ప్రాణహిత‌ల నుంచి భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరడంతో భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. గురువారం సాయంత్రం 8 గంటలకు 51.9 అడుగుల నీటిమట్టం నమోదు కాగా 13,66,299 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తూ.. అనంతరం గోదావరి క్రమంగా తగ్గుతోంది. బుధవారం అర్ధరాత్రి 12గంటలకు 48.6 అడుగులుండగా గురువారం తెల్లవారుజామున 3 గంటలకు 49.5 అడుగులకు చేరింది. ఉదయం 6గంటలకు 50.3, 9 గంటలకు 50.9, మధ్యాహ్నం 12 గంటలకు 51.4, 3 గంటలకు 51.9 అడుగులకు చేరి సాయంత్రం 8 గంటల వరకు 51.9 అడుగుల ప్రవహించిన గోదావరి.. 9 గంటలకు 51.7, 10 గంటలకు 51.5, 11గంటలకు 51.4 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. ఇదిలా ఉండగా 1953 నుంచి ఇప్పటి వరకు భద్రాచలం వద్ద గోదావరి ఆగస్టు నెలల్లో 31సార్లు ఈ విధంగా తొలి ప్రమాద హెచ్చరిక స్థాయి 43 అడుగులను దాటి ప్రవహించింది.

తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో నిలిచిన రాకపోకలు

గోదావరి ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తుండటంతో తెలంగాణ - ఏపీ సరిహద్దుల్లోని అల్లూరి జిల్లా యటపాక మండలం రాయనిపేట వద్ద జాతీయ రహదారిపై వరద నీరు వచ్చి చేరింది. దీంతో ముందస్తు జాగ్రత్తగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. భద్రాచలం-చర్ల మార్గంలో తూరుబాక వద్ద, గంగోలు వద్ద, పర్ణశాలకు వెళ్లే మార్గంలో వరద నీరు వచ్చి చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సున్నంబట్టి, బైరాగులపాడుకు రెండు రోజులుగా రాకపోకలు ఆగిపోయాయి. బూర్గంపాడు మండలంలో సారపాక, రెడ్డిపాలెం వద్ద వరద నీరు రహదారిపైకి చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

స్నానఘట్టాల మెట్ల మీదే పితృ తర్పణాలు

గోదావరి ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తుండటంతో (మిగతా 6వ పేజీలో)

సారూ.. ఇదేం పని?

- వసూళ్లలో ఆరితేరిన ఓ పోలీసు అధికారి
- ఓ హోటల్ యజమాని వద్ద రూ.50వేలు డిమాండ్
- ఇసుక ట్రాక్టర్ల వారి నుంచీ నెలవారి వసూళ్లు



ఖమ్మంక్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గౌరవ ప్రదంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు అండగా ఉండాల్సిన పోలీసులే దారితప్పుతూ లంచావతారులుగా మారుతున్నారు. అడిగేవారు లేరన్నట్టుగా ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. సమస్యలు తీర్చాలంటూ పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కుతున్న వారిని ముడుపుల కోసం వేధిస్తున్నారు. తప్పు చేసిన వారిని దండించాల్సిన వారే కాసు కోసం ఇబ్బందులకు గురిచేస్తుంటే తామెవరికి చెప్పుకోవాలని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల ఖమ్మం నగరంలో ఓ పోలీసు అధికారి చేసిన పని ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది.

కారు రిపేరుకు రూ.50వేలు..

నగరంలోని ఓ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మూడుస్టార్ల పోలీసు అధికారి.. ఓ కారును అద్దెకు తీసుకుని డివిజన్ స్థాయి అధికారితో కలిసి ఓ కేసు పనిపై బయటి ప్రాంతానికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తున్న క్రమంలో జీళ్లచెరువు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగి కారు ధ్వంసమైంది. కాగా ఆకారును మరమ్మతు కోసం నగరంలోని మమతా రోడ్డులో ఉన్న ఓ మెకానిక్ షెడ్డుకు తీసుకెళ్లగా.. ఖర్చు రూ.50వేలుపైగా అయ్యింది. దాంతో ఆ డబ్బును చేతినుంచి చెల్లించడం ఇష్టం లేని సదరు అధికారి.. కొన్నేళ్లుగా హోటల్ నడిపిస్తూ.. ఏదైనా చిన్నపాటి మీటింగ్ జరిగితే పోలీసులకు ఉచితంగా భోజనాలు పంపే నగరంలోని ఓ హోటల్ యజమానికి ఫోన్‌చేసి ఆ డబ్బుచెల్లించాలని డిమాండ్ చేశారు. దాంతో ఆ హోటల్ యజమాని షాక్‌కు గురయ్యాడు. సదరు కారు షెడ్డువద్దకు వెళ్లి కారు మరమ్మతుకు ఎంతయిందని అడగ్గా రూ.50వేలు అనడంతో అవాక్కయ్యాడు. వెంటనే పోలీసు అధికారికి ఫోన్‌చేసి తాను ఆ డబ్బు ఇవ్వలేనని, ఇలాంటి వ్యవహారాలు చేసే వ్యక్తిని కూడా కాదని చెప్పడంతో 'తర్వాత చూద్దాం ముందయితే డబ్బులు కట్టండి' అని సదరు అధికారి హుకుం జారీచేశాడు. దీంతో ఏదైతే అది అవుతుందిలే అని హోటల్ యజమాని ఆ డబ్బు చెల్లించలేనని తెగేసి చెప్పాడట.

ఇసుక అక్రమార్కుల నుంచి..

ఎన్ని ఆరోపణలు వచ్చిన తీరు మార్చుకోని సదరు అధికారి.. ఇసుక దందా చేసే వారి నుంచి కూడా వసూళ్లు చేస్తున్నాడని సమాచారం. ముఖ్యంగా బోనకల్, చింతకాని మండలాలనుంచి వచ్చే ఇసుక ట్రాక్టర్లను నిలిపి గతంలో ఒక సారి సమావేశం ఏర్పాటుచేసినట్టు ఆరోపణలున్నాయి. అప్పటి నుంచి నెలవారీ మామూళ్లు చెల్లించాలని ఆదేశించడంతో సదరు అక్రమార్కులు చేసేదేం లేక నెలానెలా సమర్పించుకుంటున్నట్టు సమాచారం. అయితే ఈ మామూళ్లలో నుంచి కొంత ఉన్నతాధికారులకు కూడా పంపుతున్నానని స్టేషన్‌లోని సిబ్బందితో చెప్పడం గమనార్హం.

ఆయన గన్‌మెన్‌దీ అదే దారట..

స్టేషన్‌లో సదరు అధికారి వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి కూడా ఆయన దారిలోనే నడుస్తున్నాడని, పెట్రోల్ బంక్‌లు, వైన్‌షాపులు, రెస్టారెంట్ల వద్దకు వెళ్లి 'సార్' పేరు చెప్పి వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలున్నాయి. గతంలో కూడా ఆ గన్‌మెన్‌పై ఆరోపణలు రావడంతో సదరు పోలీసు అధికారి పిలిచి హెచ్చరించినట్టు సమాచారం. అయినా అతని తీరుమారకపోగా హోటల్ యజమానిని డబ్బులు డిమాండ్‌చేసిన దాంట్లో కూడా కీలకపాత్ర పోషించినట్టు తెలుస్తోంది. ఏదేమైనా సదరు సార్ బాగోతంపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

యూరియా కేటాయింపుల్లో

రాష్ట్రానికి అన్యాయం

- కేంద్రంతో కొట్లాడైనా తెప్పిస్తాం
- ఊచలు లెక్కబెట్టాల్సి వస్తుందనే..
- ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కూసుమంచి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మొండివైఖరి కారణంగా యూరియాకు రాష్ట్రానికి యూరియా కేంటాయింపుల్లో అన్యాయం జరుగుతోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. గురువారం కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కావాలనే తప్పుడు లెక్కలు చూపిస్తూ యూరియా కేట్యాయింపులు చేయడం లేదని, గట్టిగా అడిగితే అదిగో.. ఇదిగో ఇస్తున్నాం అంటూ కాలాయాపన చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే తెలంగాణకు చెందిన ఎంపీలతో ఢిల్లీలో యుద్ధభేరి మోగించామని, ఎంపీ రఘురాంరెడ్డి సహా ఇతర సభ్యులు కేంద్ర ఎరువుల శాఖామంత్రి జేపీ నడ్డాను కలిసి ఎరువులు అందక రైతులు ఇబ్బంది పడుతున్న తీరును వివరించారన్నారు. సుమారు 60వేల మెట్రిక్‌టన్నుల యూరియా రాష్ట్రానికి ఇస్తామని చెప్పారని, ఒకట్రెండు రోజుల్లో తెలంగాణాకు చేరుతాయని తెలిపారు. అప్పటి వరకు ఉన్న నిల్వలను దుర్వినియోగం కాకుండా జాగ్రత్తగా వాడుకునేలా అధికారులకు ఆదేశాలిచ్చామని మంత్రి పేర్కొన్నారు. ఎక్కడా బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా రైతులకు అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు.

బీఆర్ఎస్‌వి కుంటిసాకులే

రెండులక్షల టన్నుల యూరియా ఇచ్చిన వారికే మద్దతు ఇస్తామంటూ ఇటీవల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి స్పందించారు. అవన్నీ కుంటి సాకులంటూ కొట్టిపారేశారు. జైలు భయంతోనే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని విమర్శించారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ అనేక తప్పులు చేసింది. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది. వారు చేసిన తప్పులకు ఏడు చువ్వలు లెక్కపెట్టకుండా ఉండాలంటే కేంద్రంతో సఖ్యతగా ఉండాలి. మోచేతి నీళ్లు తాగాలి. అడుగులకు మడుగులు వత్తాలి. లేకపోతే జైలుకు పంపిస్తారనే (మిగతా 6వ పేజీలో)

రేపు ఖమ్మంలో

జాబ్ మేళా

జిల్లా ఉపాధి అధికారి మాధవి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్, భారత్ హ్యుందాయ్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు ఆగస్టు 23న ఉదయం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటీఐ, టేకులపల్లి) ఖమ్మంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి మాధవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలో పని చేసే విధంగా రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పోస్టులకు డిగ్రీ అర్హత కలిగిన 25 నుంచి 45 ఏళ్ల వయస్సు గల మహిళలు అర్హులని, వేతనం రూ.20 వేల నుంచి 25 వేల వరకు ఉంటుందన్నారు. భారత్ హ్యుందాయ్ ఖమ్మం, సత్తుపల్లి, మధిరలో సేల్స్ కన్సల్టెంట్ ఉద్యోగాల ఖాళీలకు డిగ్రీ/ఎంబీఏ, 2వీలర్ లైసెన్స్, 24 నుంచి 32 ఏళ్ల వయస్సు గల యువకులు అర్హులని ఎంపికైన వారికి వేతనం 18 వేలు ఉంటుందన్నారు. మొత్తం 47 ఉద్యోగాల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు.

జిల్లాలో 'అభివృద్ధి' జాతర

- నేడు పలు పనులకు ప్రజాప్రతినిధుల శ్రీకారం..
- గ్రామాల్లో కొత్త రోడ్లు మంజూరు



ఖమ్మం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : రాబోయే స్థానికసంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనుల జాతరకు శుక్రవారం శ్రీకారం చుట్టబోతుంది. పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని 20 మండలాల్లో 571 గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ శాఖల తరుపున గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగనున్నాయి. ఇటు ఖమ్మంతోపాటు అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో పనుల జాతర కార్యక్రమానికి అధికారయంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇందిరామహిళ శక్తి, స్వచ్ఛభారత్ మిషన్, వ్యక్తిగత ఆస్తుల కల్పన కింద పశువుల కొట్టాలు, గొర్రెలు, కోళ్లషెడ్లు, పండ్లతోటల సాగు, వానపాములు ఎరువుల తయారీ, జలనిధి కింద నీటి సంరక్షణ పనులు, ఊటకుంటల నిర్మాణం పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించబోతున్నారు. ఉపాధి హామీ పనులతో పాటు పారిశుధ్య కార్మికులు, హరిత సంరక్షణలో పనిచేస్తున్న వారిని గుర్తించి వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా అభివృద్ధి జాతర పనులకు ప్రతిపాదించే మంజూరు చేశారు. అందులో భాగంగా జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీల్లో ఈ పనులు చేపట్టబోతున్నారు. జాతీయ ఉపాధి పథకం కింద జిల్లాలో 2,459 పనులకు రూ.102.48కోట్లు మంజూరు కాగా ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభం కాగా, మిగిలిన పనులు ఈపనుల జాతరలో ప్రారంభించబోతున్నారు. రూ.55కోట్ల పనులు పూర్తికావడంతో వాటిని ప్రారంభించనున్నారు. 29అంగన్‌వాడీ భవనాల పనులకు శంకుస్థాపన చేయబోతున్నారు. గతంలో నిర్మించిన వాటిని ప్రారంభించనున్నారు. గ్రామపంచాయతీ భవనాలు 101 మంజూరుకాగా 28 పూర్తయ్యాయి. వీటిని ప్రారంభించనున్నారు. 19భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు. జిల్లాలో ఆర్‌డబ్ల్యుఎస్ కింద తాగునీటి పథకాలను కొన్ని ప్రారంభిస్తుండగా కొన్నిటికి శంకుస్థాపన చేయబోతున్నారు. మొత్తంమీద ఎన్నికలషెడ్యూల్ వచ్చేలోపు గతంలో మంజూరైన భవనాలకు ప్రారంభోత్సవాలు, కొత్తగా చేపట్టబోయే పనులకు శంకుస్థాపనలతో గ్రామాలు సందడిగా మారబోతున్నాయి.

పాల్వంచలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

- గంజాయి, ఐదు పిస్టల్స్, రైఫిల్ స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్ట్, పరారీలో మరొకరు
- వివరాలు వెల్లడించిన డిప్యూటీ కమిషనర్

7



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు


కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామంలో రైతుల బారులు

6

యూరియా కోసం రైతుల వెతలు

- ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల బారులు
- పోలీసు పహారాలో బస్తాల పంపిణీ

ప్రతిపక్షాలపై బీజేపీ కుట్ర

- రాజకీయ కక్షలతోనే 30 రోజుల కస్టడీ బిల్లు ఆమోదం
- ఖమ్మం ఖానాపురం హవేలీలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని

7

ఉపాధి పనుల జాతర



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- భద్రాద్రి జిల్లాలో 4002 అభివృద్ధి పనులకు రూ. 3779.72లక్షల కేటాయింపు
- ఖమ్మం జిల్లాలో 2459 పనులకు రూ. 102.48 కోట్లు

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉపాధి పనుల జాతర కొనసాగుతోంది. గ్రామీణప్రాంతాల్లో వలసలను నివారించడంతో పాటు పుట్టిన ఊరిలోనే ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం బృహత్తరమైన ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త పనులను ఈ పథకంలో చేరుస్తూ.. ప్రభుత్వం కూలీలకు ఉపాధి కల్పన లక్ష్యంగా నిర్ణయించింది. జిల్లాలో పనుల జాతర 2025లో భాగంగా ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, స్వచ్ఛ భారత్ మిషన్(గ్రామీణ్), ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల సమన్వయంతో ఈనెల 22నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాప్రనిధుల చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయాలని నిర్ణయించింది. భద్రాద్రి జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద మొత్తం 4002 మంజూరైన పనులకు రూ. 3779.72లక్షలు కేటాయించారు. అలాగే ఖమ్మం జిల్లాలో 2459 పనులకు 102.48 కోట్లు మంజూరయ్యాయి. జిల్లాలోని గ్రామాల్లో మొక్కల పెంపకంతో పాటు చెరువులు, కాలువలు వంటి వాటితో గత రెండేళ్లుగా ఈ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసేలా జిల్లా కలెక్టర్ జితేష్ చొరవతో.. జిల్లాలో అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా నూతన గ్రామ పంచాయతీ భవనాలకు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు, ప్లాస్టిక్ వేస్ట్ యూనిట్, సగ్రిగేషన్ షెడ్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా గ్రామీణ రహదారుల నిర్మాణం, ఇందిరా మహిళా శక్తి - ఉపాధి భరోసా కింద జీవనోపాధి అభివృద్ధి పనులు, స్వయం సహాయక మహిళలకు పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు షెడ్లు, కొత్త వ్యవసాయ బావుల నిర్మాణం, పండ్ల తోటలు, అజొల్లా పెంపకం వంటి అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. రైతులు ఈ పథకాన్ని వినియోగించుకుని లాభాలు అర్జించాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

భద్రాద్రి జిల్లాలో పనుల తీరుతెన్నులు ఇలా..

గ్రామ పంచాయతీ భవనాలు : గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలను దరిచేర్చేందుకు పంచాయతీ కార్యాలయాలు లేని పల్లెల్లో భవనాలను నిర్మించనున్నారు. జిల్లాలో మొత్తం 66 పంచాయతీ భవనాలకు రూ. 1320లక్షలు నిధులు కేటాయించారు.

అంగన్‌వాడీ భవనాలు : పూర్వ ప్రాథమిక విద్యను ఈఏడాది నుంచి అమలు చేస్తున్న తరుణంలో అంగన్ వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. శాశ్వత భవనాలు లేని 47 అంగన్ వాడీ కేంద్రాలకు భవన నిర్మాణాలకు రూ. 564లక్షలు నిధులు కేటాయించారు.

పశువుల పాకలు : యూనిట్ ధర రూ. 92వేలు అందిస్తారు. కనీసం ఐదు పశువులు కచ్చితంగా ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. జిల్లాలో మంజూరు అయిన 578 యూనిట్లకు రూ. 537.54లక్షలు నిధులు కేటాయించారు.

పౌల్ట్రీ షెడ్లు : ఒక యూనిట్ ధర రూ. 99వేలు అందిస్తారు. రైతు షెడ్డు నిర్మించుకుని 100 నాటు కోడి పిల్లలను పెంచాల్సి ఉంటుంది. జిల్లాలో మంజూరైన 63 యూనిట్లకు షెడ్డు నిర్మాణానికి రూ. 62.37లక్షలు నిధులు కేటాయించారు.

మేకలు లేదా గొర్రెల షెడ్లు : ఒక యూనిట్ ధర రూ. 56వేలు అందిస్తారు. 10 గొర్రెలు, మేకలు ఉన్న వారికి ప్రాధాన్యం. జిల్లాలో శాంక్షన్ అయిన 46 యూనిట్లకు షెడ్డు నిర్మాణానికి రూ. 25.3లక్షలు నిధులు కేటాయించారు.

ఇంకుడు గుంతలు : యూనిట్ ధర రూ.6,500 అందించనున్నారు. జిల్లాలో మంజూరైన 1497 ఇంకుడుగుంతల యూనిట్లకు రూ.97.30లక్షలు కేటాయించారు.

అజొల్లా పెంపకం : యూనిట్‌కు రూ.20వేలు అందిస్తారు. రైతులకు మాత్రమే ఈ పథకం కింద అందజేస్తారు. జిల్లాలో శాంక్షన్ అయిన 137 యూనిట్లకు గాను రూ. 21.92లక్షల నిధులు కేటాయించారు.

వర్మీ కంపోస్టు గుంతలు : యూనిట్‌కు సామూహికంగా లేదా వ్యక్తిగతంగా రైతులు వర్మీ కంపోష్టు షెడ్డు నిర్మాణాలకు రూ. 15వేలు అందిస్తారు.

జిల్లాలో 85 వాటర్ షెడ్లు : జిల్లాలో గుండాల, ఆళ్లపల్లి, లక్ష్మీదేవిపల్లి, బంగారుచెలక ప్రాంత రైతులకు మాత్రమే 75శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలు అందజేయనున్నారు. గుండాలలో మామకల్లు, శెట్టిపల్లి క్లస్టర్, ఆళ్లపల్లిలో అడవిరామవరం క్లస్టర్, లక్ష్మీదేవిపల్లిలో బంగారుచెలకల క్లస్టర్‌లలో 15 గ్రామ పంచాయతీలలో మొత్తం 4 వాటర్ షెడ్డు ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాంత రైతుల ఉత్పాదక పెంపుదల నిమిత్తం 263 యూనిట్లకు రూ. 116.62లక్షల నిధులు కేటాయించారు. జిల్లాలో 109 పారంపాండ్లు రూ. 154.78లక్షలు, 38 నీటికుంటలకు రూ. 297.64లక్షలు, 54 రాతి కట్టలకు రూ. 13.50లక్షలు, 15 చెక్ డ్యాంలు రూ. 1.20లక్షలు, 60 విడిరాళ్ల కట్టలు రూ.6 లక్షలు వాటర్ షెడ్ పథకంలో శాంక్షన్ అయ్యి ఉన్నాయి.

నిబంధనల ప్రకారం దరఖాస్తు : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ రైతులకు సాగులో లేని భూమిలో అభివృద్ధి పనులు, రైతులకు ఉపయోగపడే పలు వ్యక్తిగత పనులు అందుబాటులో ఉన్నాయి. లబ్ధిదారులు ఉపాధి హామీ పథకం నిబంధనల మేరకు మంజూరైన పనులు చేయాల్సి ఉంటుంది. పలు యూనిట్లకు కూలీల ఖర్చులు, సామగ్రి ఖర్చులు కలిపి అందించనున్నారు. మండల స్థాయిలో ఉపాధి హామీ ఏపీవో, ఈసీ, టీఏ, గ్రామ స్థాయిలో క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులకు కావాల్సిన పనికి సంబంధించినవి.. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.

జిల్లాలో ఉపాధి హామీ పథకం ఇలా..

జిల్లాలో 471 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 2.23లక్షల జాబ్‌కార్డులు మంజూరు చేశారు. వీటిల్లో 1.31లక్షల జాబ్‌కార్డులు యాక్టివ్‌లో ఉండగా.. మొత్తం 4.58 లక్షల మంది ఉపాధి కూలీలుండగా యాక్టివ్ 2.21లక్షల మంది లబ్ధిపొందుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి :

విద్యాచందన, డీఆర్‌డీవో

వ్యవసాయంలో ఉపయోగపడే పనులను ఉపాధి హామీ పథకంలో మంజూరు చేస్తున్నాం. రైతులు ఆయా మండలాల్లోని సంబంధిత అధికారులను సంప్రదించి దరఖాస్తులు అందజేయాలి. అవకాశాన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకుంటే జిల్లాలో ఉపాధి హామీ పథకం లక్ష్యాలను చేరుకుంటుంది.



రామచంద్రాపురం కడియాల బుడ్డివాగు వద్ద గోదావరి వరద ఉధృతిని పరిశీలిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ బ్రహ్మయ్య

వాగులకు పోటెత్తిన గోదావరి

- పలుచోట్ల రాకపోకలకు అంతరాయం

అశ్వాపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు వాగులకు గురువారం గోదావరి వరద పోటెత్తింది. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గోదావరి 52 అడుగుల వద్ద ప్రవహిస్తుండడంతో.. మండల పరిధిలోని మొండికుంట-భద్రాచలం వెళ్లే దారిలో రామచంద్రాపురం వద్ద కడియాల బుడ్డివాగుకు వరద పోటెత్తింది. ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అధికారులు ఈ రోడ్డుపై ఎలాంటి వాహనాలను అనుమతించకుండా క్రాస్‌రోడ్ వైపు రాకపోకలను మళ్లించారు. అదేవిధంగా పాములపల్లి - బట్టీలగుంపు, ఆనందాపురం - చింతిర్యాల, అమ్మగారిపల్లి- అమెర్దా గ్రామాల మధ్య గల రహదారిపైకి కూడా వరద చేరింది. అక్కడక్కడా వరినాట్లు స్వల్పంగా నీట మునిగాయి. గోదావరి ఇంకా పెరిగితే నదీ పరివాహక ప్రాంతంలోని పలు గ్రామాల్లో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా.. వరద ఉధృతిని తహసీల్దార్ మణిధర్, సీఐ అశోక్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యలు పర్యవేక్షించారు. ఈసందర్భంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కమటం నరేష్‌,ఆర్ఐ లీలావతి పాల్గొన్నారు.



బుర్రవేముల వద్ద వరద నీరు

రహదారిపైకి వరద నీరు

దుమ్ముగూడెం ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బుర్రవేముల, పర్ణశాల విద్యుత్ సబ్-స్టేషన్ల వద్ద ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపైకి గురువారం వరదనీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తూరుబాక డైవర్షన్ రోడ్డుపై వరదముంపు కొనసాగుతుండగా.. రెండోరోజు సైతం వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అలాగే సున్నంబట్టి-భైరాగులపాడుల మధ్య వరదనీటితో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పర్ణశాల నారచీరల ప్రాంతం ముంపులోనే ఉంది. తహసీల్దార్ అశోక్‌కుమార్ సున్నంబట్టి వాసులతో మాట్లాడారు. వరద ప్రవాహం పెరిగితే పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందాలని సూచించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ కల్లూరి వెంకటేశ్వరావు, నర్సింహారావు తదితరులు ఉన్నారు.

బూర్గంపాడులో వరద ఉధృతి.. నీటమునిగిన పొలాలు



బూర్గంపాడులో నీటమునిగిన పత్తి పంట

బూర్గంపాడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదావరి ఉధృతంగా రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తుండడంతో బూర్గంపాడు మండల పరిదిలోని పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం వరద ఉధృతితో నీరు ప్రధాన రహదారులపైకి చేరాయి. నాగినేనిప్రోలు రెడ్డిపాలెం-సారపాక, బూర్గంపాడు-రెడ్డిపాలెం, బూర్గంపాడు-సోంపల్లి రహదారులపై నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బూర్గంపాడు నుంచి భద్రాచలం వైపు వెళ్లే వాహనాలను మోరంపల్లిబంజర నుంచి మణుగూరు క్రాస్ రోడ్డు మీదుగా సారపాక వైపు మళ్లించారు. అలాగే బూర్గంపాడు, నాగినేనిప్రోలు గ్రామాలలో లోతట్టు ప్రాంతాల్లోని వరి, పత్తి పంట పోలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిదిలో ఐదు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్ తెలిపారు. బూర్గంపాడులో రెండు కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించారు.

నీటిపారుదల శాఖ ఖమ్మం ఈఈగా

రమేష్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్‌రెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జల వనరుల శాఖలో ఖాళీగా ఉన్న స్థానాల్లో డీఈ ఈలకు ఈఈలుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తిరుమలాయపాలెంలో డీఈగా పనిచేస్తున్న బానాల రమేష్‌రెడ్డికి ఖమ్మం ఈఈగా అదనపు బాధ్యతలను అప్పగించారు. దీంతో ఆయన గురువారం కార్యా లయంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఈఈగా పనిచేసిన మంగళపూడి వెంకటేశ్వర్లుకు ఎస్ఈగా పదోన్నతి కల్పించడంతో ఖమ్మం ఈఈ పోస్టు ఖాళీ అయ్యింది. ఖమ్మం సీఈ కార్యాలయంలో డీఈగా పనిచేస్తున్న కె.శోభారాణికి అదే కార్యాలయంలో డీఎస్సీఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే సత్తుపల్లి ఈఈ ఎస్.శ్రీనివాస్‌రెడ్డికి కల్లూరు డీఎస్‌ఈగా, మధిర డీఈఈ రాంప్రసాద్‌కు మధిర ఈఈగా బాధ్యతలు అప్పగించారు. భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఈఈ బి.అర్జున్‌కు ఆ జిల్లా డీఎస్సీఈగా, ఇల్లెందు డీఈఈ బి.కృష్ణకు ఇల్లెందు ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

యూరియా కేటాయింపుల్లో

రాష్ట్రానికి అన్యాయం

(5వ పేజీ తరువాయి)

భయంతోనే మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలని మొదటి నుంచి చెపుతున్నామన్నారు. లేకపోతే ఎవరు విస్తరేస్తే వారికే బీఆర్ఎస్ ఓట్లేయడమేంటని ప్రశ్నించారు.

వరదల్లో ప్రాణనష్టం లేకుండా చర్యలు..

గడిచిన పదిరోజుల్లో భారీ వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరుగకుండా ప్రత్యేకశ్రద్ధతో చర్యలు తీసుకున్నట్టు మంత్రి పొంగులేటి తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలో అతి భారీ వర్షాల కారణంగా 51 అడుగులకుపైగా చేరిందని మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారని తెలిపారు. పునరావాసకేంద్రాలు సిద్ధంగా ఉంచామని, 11లక్షల క్యూసెక్కుల వరదనీరు ప్రవహిస్తోందని, ఎంత విపత్తు వచ్చినా ఎదుర్కొనేవిధంగా వ్యవస్థను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లో వరదలు వచ్చినా ప్రమాదాలు రాకుండా ప్రజలు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. వరదల కాణంగా చర్యలు తీసుకునేందుకు ఇప్పటికే జిల్లాకు రూ.కోటి చొప్పున కేటాయించినట్లు వివరించారు.

క్రమంగా తగ్గుతూ...

(5వ పేజీ తరువాయి)

భక్తులు, పర్యాటకులు గోదావరిలో వెళ్లేందుకు అనుమతించకపోవడంతో స్నానఘట్టాల మెట్ల మీదే పలువురు పితృ తర్పణాలను నిర్వహించారు. పిండాలు గోదావరిలో నిమజ్జనం చేసేందుకు గజ ఈతగాళ్ల సహకారంతో ఒకరిని మాత్రమే సురక్షిత ప్రాంతంలో అనుమతిస్తున్నారు. కాగా వరద కరకట్ట వద్ద ఉన్న భద్రాద్రి దేవస్థానం కల్యాణకట్ట కింది భాగం బుధవారం నీట మునగగా ఉగ్ర గోదావరి కారణంగా పూర్తిగా మునిగిపోయింది. అలాగే స్నానఘట్టాలు, మహిళలు దుస్తులు మార్చుకునే షెడ్లు నీట మునిగాయి. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గజ ఈతగాళ్లను అక్కడ ఏర్పాటు చేశారు.

పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం, సబ్‌కలెక్టర్ మృనాల్ శ్రేష్ట

గోదావరి వరదల నేపథ్యంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, సబ్‌కలెక్టర్ మృనాల్ శ్రేష్ట భద్రాచలంలో వరద పరిస్థితిని పరిశీలించారు. అనంతరం దుమ్ముగూడెం మండలంలోని సున్నంబట్టి గ్రామంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ నాటు పడవలో సున్నంబట్టి గ్రామానికి వెళ్లివరద బాధితులను పరామర్శించారు. ఏటా వరదలకు తమ గ్రామం మునుగుతుందని స్థానికులు పేర్కొనగా వారిని సురక్షిత ప్రాంతాలాకు తరలించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలి
- వసతులు, విద్యార్థినుల సమస్యలపై ఆరా
- సౌకర్యాల కల్పనకు రూ.10లక్షలు మంజూరు
- గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీలో ఐటీడీవో పీవో రాహుల్, సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్

కల్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ పీవో రాహుల్ హెచ్‌ఎంలు, వార్డెన్లను ఆదేశించారు. ఇటీవల వరుసగా రెండుసార్లు విద్యార్థినులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో కల్లూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీవో రాహుల్.. సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్‌తో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, స్టోర్, స్టాక్ రూమ్స్‌ను తనిఖీ చేసి.. విద్యార్థినులకు వండిన ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి వారు భోజనం చేశారు. రోజు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా? లేదా? సౌకర్యాలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడిన పీవో రాహుల్.. నాసిరకం ఆహారం అందించడం వల్లే విద్యార్థినులు అస్వస్థత గురయ్యారంటూ తమకు ఫిర్యాదులు అందుతున్నాయని, మెనూ ప్రకారం ఆహారం నాణ్యతతో వండాలని, తొలుత సిబ్బంది తిన్న తర్వాత.. వేడిగా ఉన్నప్పుడే విద్యార్థినులకు వడ్డించాలన్నారు. వంట పాత్రలు, కూరగాయలను శుభ్రపరచాలని, వర్షాకాలం అయినందున పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం వహించొద్దన్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు స్థానికంగా అందుబాటులో ఉండాలని కోరారు. అనంతరం ఐటీడీఏ పీవో రాహుల్ విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నామని, వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనపై దృష్టి పెట్టి ఇకపై పాఠశాలలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టనున్నట్లు అయన తెలిపారు. ఆయన వెంట ఏడీఎం హెచ్వో సైదులు, తహసీల్దార్ పి.సాంబశివుడు, వైద్యాధికారి నవ్యకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి

- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న ఉద్యోగుల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి కోరారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఉద్యోగుల ఆత్మగౌరవసభకు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉద్యోగులు చేపట్టిన 33 జిల్లాల్లో సీపీఎస్ ఉద్యోగులతో ముఖాముఖి కార్యక్రమానికి సంఘీభావం తెలుపుతూ గురువారం ఖమ్మం జిల్లాల్లో పర్యటించారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లో ఉద్యోగులతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీసీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లింగమొళ్ళ దర్శన్‌గౌడ్, నాగవెల్లి ఉపేందర్ మాట్లాడుతూ.. సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేందర్ రావు, భద్రాద్రి జిల్లా అధ్యక్షులు రవికుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శిరందాసు రామదాసు, నల్గొండ జిల్లా అధ్యక్షులు కొరివి కృష్ణ, ఉద్యోగ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ



మధిర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీవీఎం పాఠశాలలో గురువారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో సీపీఎస్ రద్దు కోరుతూ వచ్చే నెల 1వ తేదిన హైదరాబాద్‌లో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా కార్యదర్శి రంగారావు మాట్లాడుతూ.. నూతన పింఛన్ విధానాన్ని అమలు చేసిన సెప్టెంబర్ 1వ తేదిని విద్రోహ దినంగా పాటిస్తున్నామని తెలిపారు. మహాధర్నాకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయు సంఘ నాయకులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, సుదాకర్, ఆర్. బ్రహ్మరెడ్డి, రవి కుమార్, కె. శ్రీనివాసరావు, డి. వెంకటేశ్వరరావు, మదార్ పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల వెతలు

- ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల బారులు
- పోలీసు పహారాలో బస్తాల పంపిణీ

కూసుమంచి / కామేపల్లి / పాల్వంచ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఎక్కడో ఓచోట బస్తాల కోసం క్యూ కడుతూనే ఉన్నారు. ఈ క్రమంలో గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ పలు చోట్ల అన్నదాతలు ఎరువుల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో తోపులాటలు లాంటి సంఘటనలు జరగకుండా పోలీసు పహరా మధ్య పంపిణీ చేయాల్సి వచ్చింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామంలోని గోడౌన్ వద్ద రైతులు బారులుదీరారు. యూరియా వచ్చిందనే సమాచారంతో అధిక సంఖ్యలో అక్కడి తరలొచ్చిన రైతులు ఆధార్ కార్డు చేత పట్టుకుని క్యూ కట్టారు. అయితే కేవలం 225 బస్తాలు మాత్రమే వచ్చాయని, ఒక్కోరైతుకు ఒక్కబస్తామాత్రమే ఇచ్చారని, ఆ ఒక్క బస్తా ఏం సరిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అక్కడ పోలీసుల పహరా మధ్య యూరియా పంపిణీ చేశారు. కామేపల్లి పీఏసీఎస్ కార్యాలయం ఎదుట కూడా రైతులు బారులు తీరారు. అయితే పది ఎకరాలున్న రైతుకు కూడా ఒక్క కట్ట మాత్రమే ఇస్తాననడంతో వారంతా ఆందోళన చేపట్టారు. సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఒక్క యూరియా కట్టతో వ్యవసాయం ఎలా చేయాలని నిలదీశారు. పీఏసీసీఎస్ కార్యాలయంలో 225 బస్తాలు ఉన్నా.. వాటికి డీడీ నెంబర్ రాలేదని సిబ్బంది కాలయాపన చేయడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆ ఒక్క యూరియా కట్టకు కూడా ఆధార్ లింక్ పెట్టడం గమనార్హం. ప్రభుత్వం అరకొర యూరియా సరఫరా చేయడంతో ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. వెంటనే కొరత లేకుండా ప్రభుత్వం యూరియాను సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సొసైటీ వద్దకు యూరియా కోసం రైతులు అధిక సంఖ్యలో చేరుకోవడంతో అధికారులకు ముచ్చమటలు పట్టాయి. రైతులు తోపులాట జరిగింది. దీంతో అధికారులు పోలీసు బందోబస్తు మధ్య గురువారం యూరియా పంపిణీ చేశారు. పాల్వంచ మున్సిపాలిటీ, మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 7.400 ఎకరాల్లో వరి, 10వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తుండగా.. ఏజెన్సీ గ్రామాల్లో 2వేల ఎకరాల వరకు మొక్కజొన్న వేశారు. ఆయా పంటలకు యూరియా వసే సమయం ఆసన్నం కావడంతో రైతులు మార్క్‌ఫెడ్, ప్రైవేట్ ఎరువుల దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఒక్కొక్క రైతు పేరు మీద ఉన్న పాస్ పుస్తకం పై ఒక్క యూరియా కట్ట మాత్రమే అధికారులు పంపిణీ చేస్తున్నారు. అది కూడా ఆన్‌లైన్ ప్రక్రియ కావడంతో జాప్యం జరుగుతోంది. ఫలితంగా గంటల కొద్ది క్యూలో నిల్చోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. పాల్వంచ మున్సిపాలిటి, మండలంలోని రైతులకు 1200 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామని, మరో 5టన్నుల యూరియా అవసరం ఉంటుందని ఏవో శంభోశంకర్ తెలిపారు. అయితే ఓ లారీ యూరియా రావడంతో ఒక్కసారిగా రైతులు వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి చేరుకున్నారు. యూరియా దిగుమతికి కూడ ఇబ్బందిగా మారింది. అధికారులు రైతులను అదుపు చేయలేకపోయారు. తప్పని పరిస్థితిలో కొంతమంది పోలీసులను పిలిపించుకుని సీరియల్ నెంబరు పద్ధతిలో రైతులకు పంపిణీ చేశారు. ఒక లారీ యూరియా అక్కడికి వచ్చిన రైతులకు పూర్తిస్థాయిలో అందలేదు. పోలీసులు, అధికారులు కొంతమంది రైతులకు నచ్చచెప్పి పంపించారు.



పాల్వంచ సొసైటీ కార్యాలయం ఎదుట రైతులు

నిండని లంకాసాగర్ ప్రాజెక్టు



అలుగు పారని లంకాసాగర్ ప్రాజెక్టు

పెనుబల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గత పదిరోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ పెనుబల్లి మండలంలో మాత్రం సాదాసీదాగా వర్షాలు కురుస్తుండడంతో మధ్యతరహా ప్రాజెక్టు అయిన లంకాసాగర్‌తోపాటు ప్రధాన నీటివనరులైన రాతోని చెరువు తదితర చెరువులు కూడా బుధవారం వరకు నిండలేదు. ఒక పక్క జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ పెనుబల్లి మండలంలో వర్షాలు కురవకపోవడంతో 16అడుగుల నీటిమట్టం సామర్థ్యం ఉన్న లంకాసాగర్ ప్రాజెక్టుకు 15.3అడుగుల నీరు మాత్రమే చేరింది. దీంతో అలుగు పారకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు దశాబ్ధాలలో ఆగస్టు నెలలోపు ప్రాజెక్టు నిండకపోవడం ఇదే ప్రథమం అని పలువురు రైతులు పేర్కొంటున్నారు. పెనుబల్లి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని రెండువేల ఎకరాలకు సాగు నీరందించే రాతోని చెరువు కూడా ఇంతవరకు అలుగు పారలేదు. 16అడుగుల సామర్థ్యం ఉన్న చెరువుకు 11అడుగుల వరకు మాత్రమే నీరు చేరింది. ఇప్పటివరకు ఒకట్రెండు చెరువులు మినహా మండలంలోని సుమారు 60చెరువులు ఇంకా నిండలేదు. పెనుబల్లి, వేంసూరు మండలాల రైతులకు చెందిన పదివేల ఎకరాల సాగు భూములకు నీరందించడంతోపాటు 300మంది మత్స్యకారులకు జీవనోపాధిగా లంకాసాగర్ ప్రాజెక్టు ఉంది. పూర్తిస్థాయిలో వర్షాలు కురిసి చెరువులు నిండాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపక్షాలపై బీజేపీ కుట్ర

» రాజకీయ కక్షలతోనే 30రోజుల కస్టడీ బిల్లు ఆమోదం » సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దేశానికి ఉపయోగపడే చట్టాలు చేయాల్సిన చట్టసభలు చట్టపరమైన విధానాలను తప్పించుకునే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్షలతో బిల్లులు ఆమోదం చేస్తుందని ఈ దిశగానే 30 రోజుల కస్టడి బిల్లును పార్లమెంట్‌కు తీసుకొచ్చి ప్రతిపక్ష పార్టీలపై రాజకీయ కక్షలను తీర్చుకునేందుకు ఆమోదం కూడా తెలిపిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. ఖమ్మంనగరంలోని ఖానాపురం సీనియర్ సీపీఎం నాయకుడు, ఖానాపురం హావేలి కార్యదర్శి తండ్రి దొంగల కోటయ్య సంస్మరణ గురువారం డివిజన్ కార్యదర్శి విక్రమ్ అధ్యక్షతన నిర్వహించారు. సభకు హాజరైన తమ్మినేని వీరభద్రం జాతీయ అంశాలపై ప్రసంగించారు. 30రోజులు పాటుగా నేరారోపణలపై ఎమ్మెల్యేలు, మంత్రులు, సీఎంలు, పీఎంలు జైలులో ఉంటే వారిని వారిని తొలగించే బిల్లును బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టి ఏకపక్షంగా బీజేపీ పార్టీ ఆమోదం తెలుపుకుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఆ ప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు కూలదోయటమే బిల్లు లక్ష్యంగా రూపొందించరని ఇటువంటి చర్యలను యావత్తు దేశ ప్రజలు ఖండించాలని పిలుపునిచ్చారు.

సీపీఎం పార్టీ సిద్ధాంతాలను తుది శ్వాస వరకు అమలు చేసిన దొంగల కోటయ్య పార్టీ కోసం అనేక కష్టాలను ఎదుర్కొన్నారని తెలిపారు. ఖానాపురం హావేలీ కార్యాలయం నిర్మాణంలోను తనవంతు కృషి చేశారని గుర్తు చేశారు. తుది శ్వాస విడిచే వరకు పార్టీ కోసం పనిచేశారన్నారు. తన కుమార్ని ఉత్తమ నాయకుడిగా తీర్చిదిద్దారని, ఒకే కుటుంబంలోని వారు వెర్వేరు పార్టీలో ఉండగా దొంగల కోటయ్య కుమారుడు దొంగల తిరుపతి రావును క్రమశిక్షణ కలిగిన కార్యకర్త నుంచి ఖానాపురం హావేలీ కార్యదర్శిగా ఎదిగారన్నారు. ఖానాపురం ప్రాంతంలో అనేక సమస్యలపై దొంగల కోటయ్య పోరాటాలు చేశారని, గ్రామ పంచాయతీగా ఉన్న రోజుల్లోను క్రీయాశీలకంగా వ్యవహరించారన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీఐటీయూ జాతీయ నాయకులు ఎం సాయిబాబు, బీ వెంకట్, పాలడుగు భాస్కర్, బుగ్గవీటి సరళ, పొన్నం వెంకటేశ్వరరావు, బండి రమేశ్, బండి పద్మ, ఎస్ నవీన్ రెడ్డి, ధనియాకుల నాగేశ్వరరావు, పెద్ది నాగయ్య, చిలకల వెంకటేశ్వర్లు, పోతురాజు వెంకటి, గాలి వెంకటాద్రి, కత్తుల అమరావతి తదితరులు పాల్గొన్నారు.


దొంగల కోటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తమ్మినేని

ప్రతిభ, ఆసక్తి ఉన్నా..
వెక్కిరిస్తున్న పేదరికం

» జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వెళ్లలేని స్థితిలో పినపాక యువకులు

పినపాక, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గిరిజన బిడ్డల ప్రతిభకు కొదవలేదు. గుర్తించి, సానపడితే రత్నాలేనని మరోసారి నిరూపించారు. కానీ వారి ప్రతిభకు, ఆసక్తికి పేదరికం అడ్డుగా మారుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలకేంద్రానికి చెందిన దబ్బగట్ల లోకేష్ కిన్నెరసాని స్పోర్ట్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతూ, అథ్లెటిక్స్ విభాగంలో శిక్షణ పొందుతున్నాడు. ఇటీవల అండర్ 14 విభాగంలో హన్మకొండ, జార్ఖండ్‌లలో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో నిలిచి.. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కానీ ఆ జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేందుకు అతడికి పేదరికం అడ్డంకిగా మారింది. ప్రతిభ, ఆసక్తి ఉన్నా పేదరికం కారణంగా తన కల, లక్ష్యం నీరుగారుతోంది. ఇదేవిధంగా మండలంలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన ఎల్లబోయిన రిషివర్మ కిన్నెరసాని స్పోర్ట్స్ పాఠశాలలో ఉంటూ 9వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అండర్ 15 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తా చాటాడు. తమిళనాడు రాష్ట్రం చెన్నైలో నేషనల్ ఒలింపిక్స్ వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఏజెన్సీ గ్రామం నుంచి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన రిషివర్మను కూడా పేదరికం వేధిస్తోంది. ఆర్థిక సాయం అందించే వారు లేక.. జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే స్తోమత లేక.. సాయం కోసం ఎదురుచూస్తున్నారు. తమకు చేయూతనందిస్తే జిల్లా, రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేస్తామని ఆ క్రీడాకారులు అంటున్నారు.


ఎల్లబోయిన రిషివర్మ, దబ్బగట్ల లోకేష్

సీఎం పర్యటన వాయిదాతో బెండాలపాడు వాసులకు తప్పని ఇబ్బందులు

» ఎక్కడి పనులు అక్కడే వదిలేసిన అధికారులు

చంద్రుగొండ, అగస్టు 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి బెండాలపాడు పర్యటన వాయిదాతో ఆగ్రామస్తులకు కొత్త ఇబ్బందులు వచ్చి పడ్డాయి. ఈ నెల 21 (నిన్న) న బెండాలపాడులో సీఎం రేవంత్‌రెడ్డి ఇదిరమ్మ ఇళ్ల ప్రారంభించాల్సి ఉంది. ఉపరాష్ట్రపత్తి నామినేషన్ కార్యక్రమంలో సీఎం పాల్గొనాల్సి రావటంతో ఇళ్ల ప్రారంభ కార్యక్రమం వాయిదా పడింది. అయితే గత వారం రోజుల పాటు గ్రామంలో రోడ్లు, డ్రైయిన్‌లు మరమ్మతుల కోసం గ్రామంలో ఎక్కడబడితే అక్కడ తవ్వకాలు జరిపారు. తవ్వకాల సమయంలో త్రాగునీరు పైపులు పగిలిపోయాయి, ఇళ్ల ముందు లోతైన కందకాలు తవ్వారు. అంతే కాకుండా బురద మట్టి కుప్పలు, గుంతలను ఏర్పడ్డాయి సీఎం పర్యటన వాయిదా పడిన విషయం తెలియగానే అధికారులు, సిబ్బంది ఎక్కడి పనులు అక్కడే వదిలిపెట్టి నిమిషాల్లో వెళిపోయారు దాంతో ఇళ్లలోకి రాకపోకలు, నీరు సరపరా విషయంలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీఎం పర్యటనతో గ్రామం బాగుపడిది అనుకుంటే మరిన్ని ఇబ్బందులు వచ్చిపడ్డాయని గ్రామస్థులు వాసం భద్రమ్మ, చల్లా తిరుపతమ్మ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.


పగిలిన తాగునీటి పైపులు

ఘనంగా భద్రాద్రి రామయ్య పట్టాభిషేకం

భద్రాచలం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి గురువారం పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా తొలుత స్వామి వారికి నిత్య కల్యాణం నిర్వహించి అనంతరం పట్టాభిషేక కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. దేవస్థానం రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజ లు నిర్వ హించారు. భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి భద్రాద్రి రామయ్యను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే దేవస్థానంలో వివిధ అంశాలకు వేలంపాటలను నిర్వహించి ఖరారు చేశారు. మొబైల్ లైసెన్సులకు గతంలో రూ. 8,48,500 ఉండగా ఈసారి రూ. 19.60 లక్షలకు ఖరారు చేశారు. అలాగే ఫోటో లైసెన్సు గతంలో రూ.10.20 లక్షలుండగా ఈ సారి రూ. 17.80 లక్షలకు, పర్ణశాలలో చెప్పుల స్టాండ్‌కు రూ.3 లక్షలు గతంలో ఉండగా ప్రస్తుతం రూ.3.90 లక్షలకు ఖరారు చేశారు. భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవో భవానీరామకృష్ణారావుల పర్యవేక్షణలో వేలం నిర్వహించారు.


రామాలయంలో ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

మేకల పెంపకం, ఉత్పత్తుల ప్రాసెసింగ్‌లో శిక్షణ

» ఉత్తరప్రదేశ్‌లో శిక్షణ పొందిన భద్రాద్రి జిల్లా పశు వైద్యాధికారులు

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మేకల పెంపకాలను అధికంగా గిరిజనులు నిర్వహిస్తున్న క్రమంలో... మేకల పెంపకాలను మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్ సూచనలతో జిల్లాకు చెందిన (ముగ్గురు పశు వైద్యాధికారులు) ఆనంద్‌రావు, బాలకృష్ణ, సంతోష్ పశు వైద్యులను ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మధురలోని సెంటర్ ఫర్ రిసెర్చ్ ఆన్ గోట్స్ (సీఐఆర్‌జీ), మక్దూమ్‌లో సోమవారం నుంచి ప్రత్యేక శిక్షణ పొందుతున్నారని జిల్లా పశువైద్యాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారంతో శిక్షణ పూర్తి అయ్యిందని అన్నారు. శిక్షణలో భాగంగా మేకలలో అధికపాల ఉత్పత్తి, సంతతి పెరుగుదల, పశుగ్రాసాల వినియోగం, వంటి అంశాలతో పాటు బ్రీడింగ్ అండ్ రిప్రోడక్షన్ వింగ్ బార్బరీ గోట్ బ్రీడ్‌ను పరిశీలించారని, అనుమానాలను డాక్టర్ మనోజ్ కుమార్ సింగ్ నివృత్తి చేసినట్లు తెలిపారు.


ఉత్తరప్రదేశ్‌లో శిక్షణ పొందుతున్న పశు వైద్యులు

వైభవంగా శివపార్వతుల కల్యాణం

అన్నపురెడ్డిపల్లి, అగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అన్నపురెడ్డిపల్లి భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవాలయంలో గురువారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు.


శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

సమ్మక్క-సారక్క వన దేవత విగ్రహాల ప్రతిష్ఠ

ఆళ్లపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతోగు పంచాయతీలో తీర్లాపురం-అనంతోగు గ్రామాల మధ్య గురువారం పూజారు లు అఖిల, రుపేష్ దంపతు ల ఆధ్వర్యంలో సమ్మక్క- సారక్క వనదేవత విగ్రహలను ప్రతిష్ఠించారు. గిరిజన సంప్రదాయ డప్పులు, డోలీల నడుమ వైభవంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించి దేవత మూర్తులను ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


బోనాలతో వెళ్తున్న భక్తులు

నేడు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో చీరల వేలం

భద్రాచలం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం నాడు భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరల వేలంపాట నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో నల్ల మోతు శేషయ్య తెలిపారు. భక్తులు శ్రావణ మాసంలో అమ్మవారికి సమర్పించిన చీరలను వేలంపాట ద్వారా భక్తులు దక్కించుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు ఈ వేలంలో పాల్గొనాలని కోరారు.

గర్భిణులకు సరైన వైద్యం అందించాలి: డీఎంహెచ్‌వో

భద్రాచలం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రులకు వచ్చే గర్భిణులకు సరైన వైద్యం అందించాలని భద్రాద్రి డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి అన్నారు. గురువారం భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించిన గర్భిణుల అవసరాలను తీర్చడంపై సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జయలక్ష్మి

చింతపల్లిలో మహిళపై దాడి

ఖమ్మంరూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఓ మహిళపై గొడ్డలితో దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని చింతపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. చింతపల్లి గ్రామానికి చెందిన వల్లపు రామారావు, లీలావతి దంపతులకు వారి ఇంటి పక్కన నివాసం ఉంటున్న ఎనిగండ్ల బ్రహ్మం కుటుంబానికి తరచుగా ఘర్షణలు జరుగుతున్నాయి. రామారావు, లీలావతి తమ ఇంటి సమీపంలో కాలువ పక్కన మట్టి కుప్పలు పెట్టారని, దాన్ని కోళ్లు కాలువలోకి నెట్టివేస్తున్నాయని ఇటీవల ఘర్షణ పడ్డారు. గురువారం లీలావతి మట్టి కుప్ప పెట్టిందని లీలావతిని సుగుణమ్మ గట్టిగా పట్టుకోగా బ్రహ్మం గొడ్డలితో లీలావతిపై దాడిచేశాడు. అక్కడే సమీపంలో ఉన్న వారు వచ్చి ఘర్షణను అడ్డుకున్నారు. గాయపడ్డ లీలావతిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పాల్వంచలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

» ముగ్గురు నిందితుల అరెస్ట్, పరారీలో మరొకరు

» గంజాయి, ఐదుపిస్టల్స్, రైఫిల్ స్వాధీనం

పాల్వంచ, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జగన్నాధపురంలో **గంజాయి, ఐదుపిస్టల్స్, రైఫిల్‌ను** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం **అధికారులు స్వాధీనం చేసుకున్నారు.** గురువారం పాల్వంచ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి ఈ వివరాలు వెల్లడించారు. తమిళనాడు, కేరళకు చెందిన బిలాల్, శ్యాంసుందర్, కాశీనంధన్, జేమ్స్ ఒడిషాలో గంజాయి కొనుగోలు చేశారు. ఐచర్ వ్యానులో భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం, చెన్నయ్ మీదుగాతిరుచ్చికి బయలుదేరారు. పక్కా సమాచారం అందుకున్న ఖమ్మం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్వంచ మండలం జగన్నాథపురంలో తనిఖీ చేశారు. డీసీఎం వ్యానులో 107కేజీల ఎండుగంజాయి బయట పడింది. అనుమానంతో ఎస్కార్ట్ వాహనాన్ని తనిఖీచేశారు. అందులోని ఇద్దరు వద్ద ఐదు 9ఎంఎం పిస్టల్స్ రివాల్వర్ బయటపడ్డాయి. మరో నిందితుడు మార్గమధ్యంలోనే వాహనం దిగి తప్పించుకున్నాడు. దీంతో అధికారులు మిగిలిన ముగ్గురినీ అదుపులోకి తీసుకుని పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విచారించగా వారు పిస్టల్స్‌ను మధ్యప్రదేశ్‌లో కొనుగోలు చేసి తిరుచ్చికి తరలిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. మారణాయుధాల నిరోధక చట్టం ప్రకారం కేసును పాల్వంచటౌన్ పోలీసులకు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఎన్ఫోర్స్‌మెంట్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్ఐ శ్రీహరిరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీ జనార్దన్‌రెడ్డి, స్వాధీనం చేసుకున్న పిస్టల్స్

ట్రాక్టర్ గొర్రు ఢీ: వ్యక్తి మృతి

ఇల్లెందురూరల్,ఆగస్టు21(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని అంజనేయపురంలో గురువారం ట్రాక్టర్ బురద గొర్రు ఢీకొని ఓవ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనంప్రకారం..మామిడిగుండాల గ్రామానికి సూర్నపాక రాంబాబు (30) అత్తగారు ఊరైన గుంపెళ్లగూడేనికి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. సుమారు ఐదు నెలల క్రితం వివాహం జరిగింది. భార్య గర్భవతి,ఆమెఆధార్ కార్డు పుట్టింటివద్ద ఉండటంతో తీసుకొచ్చేందుకు వెళుతున్నాడు. మార్గమధ్యలో ఆంజనేయపురం గ్రామసమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వెనువైపు ఉన్న బురద గొర్రు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈఘటనపై ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేశారు.

భూ వివాదంలో కత్తితో దాడి

ఖమ్మంక్రైం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): భూవివాదం నేపథ్యంలో ఓ వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేశారు. ఈఘటన గురువారం సాయంత్రం ఖమ్మం నగరంలో జరిగింది. స్థానికులు కథనం ప్రకారం.. ముస్తఫానగర్‌కు చెందిన తూము అంజయ్య అనే వ్యక్తికి అదే ప్రాంతానికి చెందిన తన్నీరు రాజు, శ్రీను అనే తండ్రికొడుకులతో భూ వివాదం ఉంది. ఇది చాలాకాలంగా కొనసాగుతోంది. ఈనేపథ్యంలో గురువారం సాయంత్రం సమయంలో తూము అంజయ్యపై రాజు, శ్రీనులు పదునైన కత్తితో దాడి చేశారు. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు బాధితులను నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అంజయ్య ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.

పాలస్తీనాకు అనుకూల ర్యాలీపై ఫిర్యాదు

ఖమ్మంబైపాస్‌రోడ్, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ఈనెల5న పాలస్తీనాకు అనుకూలంగా ఖమ్మంలో కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు... దీనిపై బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు భూపాలపల్లి జయశంకర్ జిల్లా ఇన్‌చార్జి గల్లా సత్యనారాయణ కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఈనెల13న ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరపాలని హోంశాఖ సిబ్బందికి ఆయన ఆదేశాలు జారీ చేసినట్టు గల్లా సత్యనారాయణ ఒకప్రకటనలో తెలిపారు.భారత ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేయించారని బాలబాలికలపై ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వారి ఆలోచన విధానాలు పిల్లలపై రుద్దేలా ప్రయత్నించడం బాధాకరమన్నారు.ర్యాలీపేరుతో మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేయిస్తూ వ్యతిరేకంగా మాట్లాడుతూ దేనికి సంకేతమన్నారు. ఖమ్మంలోర్యాలీ తీయడం చూస్తే అనేక అనుమానాలకు తావిస్తోందని, దీనిపై కేంద్రప్రభుత్వ దర్యాప్తు సంస్థలతో విచారణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

చింతకాని, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీతంపేట గ్రామానికి చెందిన నారపోగు భరత్(19) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడు ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో తండ్రి మందలించాడు. మనస్థాపానికి గురై ఈనెల17న పురుగుల మందు తాగాడు. అప్పటి నుండి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

జ్వరంతో బాలుడు..

అశ్వాపురం,ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎలకలగూడెం గ్రామానికి చెందిన సవలం రవికుమార్(7) తీవ్ర జ్వరంతో గురువారం మృతిచెందాడు. రవికుమార్ రెండు రోజులుగా తీవ్రజ్వరంతో ఇబ్బంది పడుతుండగా తల్లితండ్రులు గురువారం మణుగూరు ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమించటంతో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గోడౌన్‌లో అగ్నిప్రమాదం

» భద్రాచలంలో ఘటన.. రూ.6లక్షల ఆస్తి నష్టం

» బ్లీచింగ్ పౌడరు, యాసిడ్ బాటిళ్ల నిల్వ

భద్రాచలం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని పాత కూరగాయల మార్కెట్‌లో ఉన్న ఓ గోడౌన్‌లో గురువారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. 25టన్నుల బ్లీచింగ్ పౌడరు, యాసిడ్ బాటిళ్లు గోడౌన్‌లో వ్యాపారి బి.రవికుమార్ భద్రపరిచారు. తెల్లవారుజామున భారీమంటలు ఎగసిపడటంతో స్థానికులు అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈఅగ్నిప్రమాదంతో మూడుషాపులు పూర్తిగా దగ్ధమయ్యాయయి. పరిసరాల్లో ఉన్న తోపుడు బండ్లపై ఉన్న పండ్లు సైతం కాలిపోయాయి. ఈ క్రమంలో సీఐటీయు నాయకులు ఎంబి నర్సారెడ్డి, బండారు శరత్‌బాబు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. సుమారు రూ.లక్ష విలువైన పండ్లు కాలిబూడిద అవడంతో బాధితులను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా భవిష్యత్తులో స్టాక్ పెట్టుకోవడానికి అనుమతులు జన సామర్థ్యం లేని ప్రాంతాల్లో అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.


అగ్నిప్రమాదం దృశ్యం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హైవే అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు

కూసుమంచి,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులు ప్రాణాలు పోతున్నాయని బీజేపీ జిల్లా నాయకుడు గుండా ఉపేంద ర్‌రెడ్డి తెలిపారు. హైవే నిర్మించి ఇటీవలనే పూర్తయినప్పటికీ నాసిరకం పనుల కారణంగా వెంటనే మరమ్మతులకు గురైందని తెలిపారు. వాటి మరమ్మతుల పనులకు రోడ్డు మళ్లింపు చర్యలు తీసుకోకుండా భద్రతా ప్రమాణాలు చేపట్టకుండా చిన్న రెడ్‌కోన్‌లు ఏర్పాటు చేస్తున్నా రని తెలిపారు. కూసుమంచి ఫ్లైఓవర్ వద్ద గతరాత్రి బొలెరో డ్రైవరు మృతి అధికారుల నిర్లక్ష్యం కారణమన్నారు. తల్లంపాడు ఫ్లైఓవర్ అత్యంత ప్రమాదకరంగా ఉందని ప్రయాణికులను ఆందోళనకు గురి చేస్తోందన్నారు.



బోదులబండలోఅభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విద్యాభివృద్ధికి కృషి

- నియోజకవర్గంలో రూ.497 కోట్లతో వివిధ పనులు
- ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించండి
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని విద్యాభివృద్ధికి కృషి చేస్తు న్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డి చెప్పారు. గురువారం మధ్యాహ్నం మంత్రి శ్రీనివాసరెడ్డి నేలకొండపల్లి మండ లంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్రాజుపల్లి కొత్తూరుకు చెందిన నెల్లూరి భద్రయ్యను పరా మర్శించారు. అనంతరం బోదులబండ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.ప్రభుత్వ పాఠశాలలకు దూర ప్రాంతాల నుంచి వచ్చే 8,9,10 తరగతుల విద్యార్థినులకు పీఎస్సార్‌ట్రస్టు నుంచి సైకిళ్లు అందిస్తున్నట్లు చెప్పారు. 18నెలల్లో నియోజక వర్గానికి 497కోట్లు కేటాయించామన్నారు. జేఎ న్‌టీయు ఇంజనీరింగ్ కళాశాల, యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం, తిరుమలాయపాలెంలోనిర్మించే ఐటీఐ, హాస్టల్ భవనాలు, కూసుమంచి కళాశాలనిర్మాణాలు పురోగతిలో ఉన్నాయన్నారు.. ప్రభుత్వ పాఠ శాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం పెంచాలని, ఉపాధ్యాయుల నిష్పత్తిలో విద్యా ర్థులుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మళ్లీ బోదులబండ పాఠశాలకు వస్తే ఆసమ యంలో విద్యార్థుల సంఖ్య పెరగాలని, లేనిప క్షంలో చర్యలు తప్పవన్నారు.అనంతరం విద్యా ర్థులకు 80సైకిళ్లను అందించారు. 25 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. నేల కొండపల్లి అభివృద్ధికి 13.50 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కొడాలి గోవిందరావు, సొసైటీ అధ్యక్షుడు అనంతు కాశయ్య, గుడిమళ్ల మధు, కట్టెకోల నాగా ర్జున, వెన్నపూసల సీతారాములు,కట్టెకోలనాగే శ్వరరావు,బొడ్డు బొందయ్య, బచ్చలకూరి నాగ రాజు,మోర మల్లయ్య, కంజుల మోహన్ రెడ్డి, కైలాసపు వెంకటేశ్వర్లు, యడవల్లి నాగరాజు, తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీ డీఓ మర్రి ఎర్రయ్య, ఎంఈవో బాలిన చలప తిరావు పాల్గొన్నారు.

ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తా

తిరుమలాయపాలెం: గతఎన్నికల్లో పాలేరు ప్రాంత ప్రజలు గుండెల్లో పెట్టుకుని ఆదరిం చారని, ఈప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగు ణంగా తన తుదిశ్వాస వరకు పనిచేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని వివిధ ప్రాంతా లలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పర్య టించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థా పన చేశారు. పిండిప్రోలులో పీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థినులకు సైకిళ్లుపంపిణీ చేశారు. అర్హులైన పేదలందరికి కూడా దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేస్తామ న్నారు. అనంతరం పిండిప్రోలులో మధ్యాహ్న భోజనాన్ని మంత్రి పొంగులేటి, కలెక్టర్ పరిశీ లించారు. పిండిప్రోలు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ అనంతరం మంత్రి పొంగులేటి, కలెక్టర్ సైకిల్ తొక్కి ఉత్సాహపరిచారు.ఈకార్యక్రమంలోరాష్ట్ర పీసీసీ కార్యదర్శి మద్దినేని బేబి స్వర్ణకుమారి, జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మాజీజడ్పీటీసీ బెల్లంశ్రీను, ఏఎంసీవైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీఎంపీపీ బోడ మంగిలాల్, ఏవో సీతారాంరెడ్డి, తహసీల్దార్ లూథర్‌విల్సన్, ఎంపీడీవో సిలార్‌సాహెబ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయానికి గండి

- ప్రయాణికులను తీసుకెళుతున్న ప్రైవేటు వాహనదారులు
- కొత్తబస్టాండ్ ఎదుట నిత్యం ఇదే పరిస్థితి

ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వాహనదారులు ఆర్టీసీ ఆదా యానికి గండిపెడుతున్నారు.. నిబంధనల ప్రకారం బస్టాండ్ పరిసరాల్లోకి ప్రైవేటు వాహనాలు ప్రయాణికుల కోసం రావడం నిషేధం. అయితే అధికారులు పట్టించుకోకపో వడంతో ప్రైవేటు వాహనాల యజమానులు యథేచ్ఛగా ప్రయాణికులను తీసుకుని వెళుతు న్నారు. హైదరాబాద్, విజయవాడ, వరంగల్, సూర్యాపేట ప్రాంతాలకు వాహనాలను నడు పుతూ డబ్బులు దండుకుంటున్నారు. నూతన బస్టాండ్‌కు పక్కనే ఓ చిన్నషాపు నడుపు తున్న ఓవ్యక్తి ఈ ప్రైవేటు వాహనాలలో ప్రయాణికులను ఎక్కించి ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్నాడనే వాదనలు వినపడుతు న్నాయి. సదరు షాపు యజమాని ఈ దందాకు సొంత కార్లు(ఓన్‌ప్లేట్) ఉన్న కొంద రిని నెలవారీ అద్దె చెల్లిస్తూ నడుపుతున్నాడు.

భారీగా వసూలు

ఆ కార్లలో ఖమ్మం టూ ఎల్‌బీనగర్ వరకు రూ.700 వసూల్ చేస్తున్నాడనే విమర్శలు విన పడుతున్నాయి. ఖమ్మంటూ మియాపూర్‌కు రూ.650 ఉండగా సదరు వ్యక్తి ఎల్‌బీనగర్‌కే రూ.700 వసూల్ చేస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసీ సిబ్బందికి తెలిసే ప్రవేటు వాహనదారులు ఆ దందా చేస్తున్నట్లు తెలుస్తుంది. బస్సులు వెళ్లె ప్రధాన దారి వెంట ఒక్క ద్విచక్రవాహనాన్ని వెళ్లనివ్వని సెక్యూరిటీ ఆయన ఎదురుగానే ప్రైవేటు వాహనాల్లో ప్రయాణికులు పోతుంటే ఆప్రైవేటు వామనదారులపై చర్యలు మాత్రం శూన్యం.. బస్టాండ్‌లోకి వెళ్లి మరీ ప్రయాణికు లను తీసుకెళుతుండటం విశేషం.

బస్టాండ్ ఎదురుగా దందా..

రోడ్డుకు పక్కగా ప్రైవేటు వాహనాలను నిలుపుతూ ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతున్నారు. బస్టాండ్‌లోకి వచ్చే ప్రయాణి కులను లోనికి వెళ్లనివ్వకుండా తమ వాహనా లను ఎక్కండంటూ వెంటపడుతున్నారు. రోజుకు కనీసం 100 మంది ప్రయాణికులను ఖమ్మంనుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. పండుగల సమయంలో రోజుకు సుమారు 500మంది ప్రైవేటు వాహనాల్లో వెళుతున్నారు.

పట్టించుకోని సెక్యూరిటీ

ప్రతీ నిత్యం వందలాది మంది ప్రయాణి కులు వివిధ వాహనాలలో బస్టాండ్‌లోకి ప్రయాణం కోసం వస్తుంటారు. బస్టాండ్ బయట, పార్కింగ్ ప్రాంతంలో వాహనాలను నిలిపి తమ వారిని లోనికి పంపిస్తుంటారు. అయితే బస్టాండ్ బయట ప్రైవేటు వాహ నాలు ప్రయాణికుల కోసం నిలిపి ఉంచి.. నిజ మైన ప్రయాణికులకు అడ్డంకిగా మారారు. ఇంతా జరుగుతున్నా ఆర్టీసి సిబ్బంది, అధికా రులు, సెక్యూరిటీ వాళ్లు ఏమాత్రం పట్టించుకో వడం లేదు.రోజుకు 10 నుంచి 15 సొంత వాహనదారుల కార్లు బస్టాండ్ వద్దకు వచ్చి ప్రయాణికులను ఎక్కించుకోని వెళ్తుంటారు.

ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది?

సొంత వాహనాలు(ఓన్‌ప్లేట్) ఉన్న వారు రోడ్డు మార్గంలో ప్రయాణికులను తరలించడా నికి అనుమతి లేదు. అయితే ఇదేమీ పట్టించు కోని ప్రైవేటు వాహనాల యజమానులు(తె లుపు నెంబరు ప్లేటు) నిత్యం ప్రయాణికు లను హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ఎలాంటి భద్రతా చర్యలు లేని ప్రైవేటు వాహనాలలో ప్రయిణిస్తున్న సందర్భంలో ప్రమాదం జరిగితే బాధ్యత ఎవ రిదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



నూతన బస్టాండ్ పక్కనే ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ప్రైవేటు వాహనం

నర్సింగ్ సిబ్బందికి ఐదురోజుల వేతనాన్ని ఆపండి

- అదనపు కలెక్టర్ శ్రీజ
- జిల్లా ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రిలోని నర్సింగ్ సిబ్బంది ఐదురో జుల వేతనాన్ని నిలిపేయాలని అదనపు కలె క్టర్ శ్రీ ఆదేశించారు. అపరిశుభ్ర వాతావరణం, రక్తపు మరకలు ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్‌కు ఈ ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఆమె ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులో కలియ తిరిగారు. వార్డుల్లో ఉన్న రోగులు, వారి బంధువులతో మాట్లాడారు. వైద్యులు జాగ్రత్తగా చూస్తున్నారా... నర్సింగ్ సిబ్బంది ఓపికగా మాట్లాడుతున్నారా అంటూ ప్రశ్నించారు. ఆ తర్వాత క్యాజువాలిటీ , ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచా లంటూ ఆదేశించారు. మూడు నెలలుగా నిర్మి స్తున్న మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలిస్తూ టీఎస్‌ఎంఐడీసీ డీఈని మందలించారు. మీరు ఈ పనులను పూర్తి చేయకుంటే పనిష్మెంట్ తప్పదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఆర్ ఎంవోలు డాక్టర్ బి రాంబాబు, డాక్టర్ వినా యక్ రాథోడ్, ఆర్థోహెచ్‌వోడీ డాక్టర్ ఎల్ కిరణ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్, టీఎస్‌ఎం ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులున్నారు.



టీఎస్‌ఎంఐడీసీ డీఈని మందలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

పిల్లల ఎదుగుదలను పర్యవేక్షించాలి
అదనపు కలెక్టర్ సమీక్ష

పిల్లల ఎదుగుదలను రెగ్యులర్ గా పర్యవే క్షించాలని స్థానికసంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఆమె మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమశాఖల పనితీరుపై అధికారులతో సమీ క్షించారు. పిల్లల ఎదుగుదల పర్యవేక్షణను నిర్లక్ష్యం చేసేసిబ్బంది ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లి పోవచ్చని అదనపు కలెక్టర్ హెచ్చరిం చారు. పోషకాహార లోపం గల పిల్లల సంఖ్య రాబోయే రోజులలో తగ్గించడమే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణీ మహిళలు, పిల్లలు హాజరు ఎఫ్ఆర్ఎస్ ద్వారా 100 శాతం జరిగేలా చూడాలని, అంగ న్వాడీ కేంద్రాలలో ఉన్న పిల్లలు ప్రభుత్వ పాఠ శాలలో చేరేలా చూడాలన్నారు. ఈ సమావే శంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, సీడీపీవోలు, సూపర్వైజరు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపికలకు స్పందన

ఖమ్మంస్పోర్ట్స్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 30, 31 తేదీల్లో మహబూబ్‌నగర్ జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా అథ్లెటిక్స్ జట్లను గురువారం నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా 124 మంది బాలురు, 76మంది బాలికలు హాజరయ్యారు. ఎంపికలలో భాగంగా అండర్- 14, 16, 18, 20 విభాగాల్లో ఎంపి కలు నిర్వహించారు. ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియోషన్ అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎండీ షఫీక్ అహ్మద్ ప్రకటించారు. ఎంపికలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు సుధాకర్, రవి, నవీద్, తిరుపతి, కోచ్ గౌస్ తదితరులు సమీక్షించారు.



బాధ్యతలు స్వీకరించిన మెప్మా పీడీ నళినీ పద్మావతి

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు 21(ఆంధ్ర జ్యోతి): ఖమ్మంమెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కే.నళిని పద్మావతి గురువారం బాధ్యతలు చేపట్టారు. మెప్మా డీఎంసీ, ఏడీఎంసీ, సీవోలతో సమా వేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న మెప్మా కార్యక్రమాలను తెలుసుకున్నారు. జిల్లాలో ఎన్ని మున్సిపాలిటీలు ఉన్నాయి. సీవోలు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారని ఎంతదూ రంలో మున్సిపాలిటీలు ఉంటాయనే విషయా లను తెలుసుకున్నారు. ప్రజావాణి గ్రీవెన్స్‌లకు ఎవ్వరు హాజరైతారనే విషయాలు, బ్యాంకర్లతో సమావేశాలపై తెలుసుకున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంఘాలకు అందించే పథకాల లక్ష్యాలను నూరుశాతం పూర్తి చేయ టమే తొలి ప్రాధాన్యతగా తాను తీసుకుంటా నని, అర్హత కలిగిన ప్రతీమహిళ స్వయం సహా యక సంఘాల్లో సభ్యులుగా చేరాలని ఖమ్మం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కే.నళిని పద్మావతి పేర్కొన్నారు. డీఎంసీ సావల సుజాత, ఏడీఎంసీ వెంకటేశ్వరరావు, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, సీవోలు సల్మా, గొప్పోజీ ఉపేంద్ర, చిలకా ద్రౌపది, బొల్లికొండ రోజా, కంప్యూటర్ అపరేటర్ రాయల వెంకటేశ్వర్లు పీడీకి పుష్ప గుచ్చాలను అందించారు.



పశువుల రవాణా.. నలుగురిపై కేసు నమోదు

ఖమ్మంక్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహ నాన్ని స్వాధీనం చేసుకొని నలుగురిపై ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు గురువారం సాయంత్రం కేసు నమోదుచేశారు. ముస్తా ఫానగర్ సమీపంలో తనిఖీలు నిర్వహి స్తుండగా, పండితాపురం నుంచి కోదాడ ప్రాంతానికి ఏడు పశువులను వ్యాన్ తీసు కెళ్తున్నారు. ఈ నేపథ్యంలో వారిని పోలీ సులు అదుపులోకి తీసుకున్నారు. అనం తరం పట్టుకున్న పశువులను గోశాలకు తరలించారు. నలుగురిపై కేసు నమోదుచే సినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

మాస్‌లైన్ నగర కార్యదర్శిగా శోభ

- సహాయ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు
- ఏకగ్రీవంగా ఎన్నిక



ఖమ్మంసంక్షేమ విభాగం, ఆగస్టు 21(ఆంధ్ర జ్యోతి): సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఖమ్మం నగర కార్యదర్శిగా ప్రతాపనేని శోభ, సహాయ కార్యదర్శిగా ఇమ్మిడి వెంకటేశ్వర్లును ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. గురువారం రామన ర్సయ్య విజ్ఞాన కేంద్రంలో డివిజన్ కార్యదర్శి ఝాన్సీ అధ్యక్షతన నిర్వహించిన సమావే శంలో ఈఎన్నిక జరిగింది. కాంగ్రెస్ కుటుం బంలో జన్మించిన ప్రతాపనేని శోభ 2016లో పీవోడబ్ల్యూ సభ్యురాలిగా చేరారు. తర్వాత 2019లో న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్య లుగా ఎన్నికైనారు. తర్వాత పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. తర్వాత రాష్ట్ర కమిటీ సభ్యులుగా పని చేశారు. ఇప్పుడు మాస్‌లైన్ నగర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శోభ విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మంనగ రంలో ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తా మన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, కార్మికులు, ఉద్యోగులు సమస్యలపై ఉద్య మాలు చేస్తామన్నారు. సమస్యలను ఎప్పటిక ప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామన్నారు.

పల్లెదవాఖానాకు పోయేదెట్లా?

- బురదగా మారిన రహదారి
- వృద్ధుల నుంచి బాలింతల వరకు ఇబ్బందులు
- ఏడాది క్రితమే సీసీ రోడ్డుకు శంకుస్థాపన

రఘునాథపాలెం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వీ.వెంకటాయపాలెం పల్లెదవాఖానాకు వెళ్లె రహదారి రోగులకు ఇబ్బందిగా మారింది. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం ఉన్న ఈ ప్రాంతంలో నిత్యం కలెక్టరేట్ ఉద్యోగుల నుంచి మూడు గ్రామాల ప్రజలు వైద్యసేవల కోసం వస్తుంటారు. నిత్యం దీర్ఘకాలిక వ్యాధుల రక్త పరీక్షల కోసంవృద్ధుల నుంచి గర్భిణుల వరకు వ్యాధి నిరోధక టీకాల కోసం పిల్లలు సైతం తీసుకొస్తుంటారు. అయితే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల చొరవతో ఏడాది క్రితమే ఇక్కడి పల్లెదవాఖానాకు సీసీరహదారి మం జూరు చేశారు. శంకుస్థాపన కూడా చేశారు. కానీ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించక పోవ టంతో రహదారి ఇబ్బంది కరంగా మారింది. పల్లెదవాఖానకు వచ్చే వారు అడుగులో అడు గులు వస్తూ నడుస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులను చేప ట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



చిత్తడిగాపల్లెదవాఖానాకు వెళ్లే దారి



వీవీ పాలెం పల్లెదవాఖానా

తాండ్ర వినోద్‌రావుకు ఫేక్ కాల్

ఖమ్మంక్రైం,ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావుకు గురు వారం ప్రధానమంత్రి కార్యాలయం పీఏ తన్మయ్ మెహతా అని ఫోన్లో తప్పుడు పరి చయం చేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత వినోద్‌రావు నేరుగా ప్రధామంత్రి కార్యాల యాన్ని సంప్రదించారు. అలాంటి కాల్స్ ఎవరు చేయలేదని ధ్రువీకరించారు. దీంతో సైబర్ క్రైమ్ కేటుగాళ్లు ఫోన్ చేశారని భావించి తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదుచేయనున్నట్లు తాండ్ర వినోద్‌రావు తెలిపారు.

రేపు హైదరాబాద్‌లో మహాధర్నా

ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న ఉపాధ్యాయ సంఘాల పోరాటకమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సంఘం స్టీరింగ్ కమిటీ సభ్యులు ప్రకటించారు. గురువారం నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్టీరింగ్‌కమిటీ సభ్యులు యూటీ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, టీపీటీఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎన్ తిరుపతి మాట్లాడారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో మహాధ ర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహా ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలి

ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఆగస్టు 23న బ్లాక్‌డేకు పిలుపునిస్తూ టీఎస్ సీపీఎస్ ఈయూ నిర్ణయం తీసుకుందని జిల్లాఅధ్యక్షుడు చంద్ర కంటి శశిధర్ పిలుపునిచ్చారు. సీపీఎస్ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీసీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపకుడు మధ్యాహ్న భోజన విరామంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియ జేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'బొమ్మ'కు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా గ్రాంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్

ఖమ్మంఖానాపురం హవేలి, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): నగరంలోని బొమ్మ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలకు రెండోసారి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా గ్రాంట్ సర్టిఫికెట్ లభించిందని కళాశాల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, వైస్‌చైర్మన్ బొమ్మ సత్యప్రసాద్ తెలిపారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి ఇంటలెక్చువల్ ప్రాపర్టీరైట్స్ రిజిస్టేషన్ సర్టిఫికె ట్‌ను పొందామని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో విద్యార్థులతో కలిసి సర్టిఫికెట్లను అందుకున్నారు.



విద్యార్థులతో కళాశాల చైర్మన్

గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలి

తిరుమలాయపాలెం,ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాల సీజ న్‌లో వివిధరకాల అంటువ్యాధుల ప్రబలే అవకాశం ఉందని గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో గురువాం ఎంపీడీవో సిలార్‌సాహెబ్‌కు వినతిపత్రం అందించారు. గ్రామపంచాయతీలకు నిధులు లేకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు అస్థవ్యస్థంగా మారాయని, దీంతో ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారని తెలిపారు. పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకుఅందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బోదకాలు వ్యాధి గ్రస్తులకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించి మందులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాస్‌లై న్ జిల్లనాయకులు కె.నాగేశ్వరరావు, టి.హనుమంతరావు, పి.వెంకట స్వామి, ఎస్.వెంకటేవ్వర్లు, ఆర్.వెంకన్న, బి.శంకర్ పాల్గొన్నారు.

ఏదులాపురంలో అందుబాటులో యూరియా



రైతులకు కూపన్లు అందజేస్తున్న సిబ్బంది

ఖమ్మంరూరల్, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): ఏదులాపురం సహకార సంఘంలో యూరియా అందుబాటులో ఉందని రైతులు ఎవరు ఇబ్బంది పడాల్సిన పనిలేదని సహకార సంఘం సీఈఓ మహ్మద్ అలీ తెలిపారు. మండల పరిధిలోని పల్లెగూడెంవద్ద సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోడౌన్‌లో యూరియా బస్తాలు నిలువ చేశారు. యూరియా కావాల్సిన రైతులకు గురువారం సొసైటీ సిబ్బంది రైతులు వివరాలు నమోదు చేసుకుని యూరియా అందజేశారు. యూరియా 152 మెట్రిక్ టన్నులు, డీఏపీ 20మెట్రిక్ టన్నులు, 28ఎరు వులు 10మెట్రిక్ టన్నులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు సుమారు 400 మంది రైతులకు ఎరువులు అందజేశామన్నారు. ప్రస్తుతం గోడౌన్ లో యూరియా 10మెట్రిక్ టన్నులు స్టాక్ ఉందన్నారు. డీఏపి 5 టన్నులు, 28 కట్టలు 5 టన్నులు కట్టలు అందుబాటులో ఉందన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారికి అవసరమైన మందు కట్టలను అందిస్తామన్నారు. రైతులు ఎవరు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు.

వీర జవాన్ కుటుంబానికి రూ.లక్ష సాయం

కారేపల్లి, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యావాన్ హైస్కూ ల్‌కు చెందిన 2009ఎస్ఎస్‌సీ బ్యాచ్ మిత్రులు ఆర్మీ అమర్ జవాన్ అనిల్ కుమార్ పేరుతో స్థానిక ఎస్‌బిఐ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా జమ చేశారు. ఈ సందర్భంగా అనిల్ స్నేహి తులు భావోద్వేగంతో మాట్లాడుతూ.. అనిల్ తమకు స్నేహితుడు మాత్రమే కాదని అన్నయ్యలాంటి వాడన్నారు. అనిల్ త్యాగం వల్లే అందరం సరక్షితంగా ఉన్నా మన్నారు. తాము చేసిన చిన్నసహాయం ద్వారా అనిల్ కుటుంబం పక్కన నిలబడ్డా మన్న గౌవరం దక్కిందన్నారు. అనిల్ ధైర్యం ఎల్లప్పుడూ విద్యావాన్ హైస్కూల్ విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. నాటి స్నేహితుల ఉదార మానవీయ ఆర్థిక సాయంపై గ్రామస్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు. వీరజవాన్ల త్యాగానికి ఇటువంటి సహా యాలే నిజమైన గౌరవమని, యువతకు ఇది ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మిత్రు లందరు కలిసికట్టుగా వచ్చి అనిల్ కుటంబ సభ్యులకు తామంత అండగుం టామని భరోసా కల్పించారు.



అనిల్ కుటుంబసభ్యులకు డిపాజిట్ చెక్కును అందిస్తున్న స్నేహితులు

శిథిలావస్థలో పంచాయతీ దుకాణ సముదాయం



శిథిలావస్థకు చేరుకున్న పంచాయతీ దుకాణాల సముదాయం

కారేపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాధపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో ఉన్న గ్రామపంచాయతీ దుకాణాల సముదాయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పంచాయతీకి ఎంతోకొంత ఆదాయం సమకుర్చే దుకాణాలు పూర్తిగా శిథిలాస్థకు చేరుకోవడంతోపాటు, వాటికున్న షటర్లు కూడా ధ్వంసం అయ్యాయి. సర్పంచ్‌ల పదవికాలం ముగిసి, కార్యదర్శుల పాలన వచ్చింది. అధికారులు అయిన స్పందించి దుకాణాల సముదాయానికి మరమ్మతులు చేపట్టి అందుబాటులోతీసుక రావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

‘ఓపెన్’ ప్రవేశాలకు గడువు పెంపు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాలకు ఈనెలాఖరు వరకు గడువు పొడిగించినట్లు కో-ఆర్డినేటర్ డాక్టర్ చీపు పూర్ణచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ స్టడీ సెంటర్‌లలో ప్రవేశాలు పొందగోరు వారు 9491881910, 8187837058 నంబర్లను సంప్రదించాలని కోరారు. డిగ్రీలో చేరుటకు ఇంటర్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్, డిప్లోమా పాసైన విద్యార్థులు అర్హులని, ఈ విద్యా సంవత్సరం నుంచి ఎస్టీ కోయ, చెంచు, గోండు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత డిగ్రీ విద్యను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

వైరా మునిసిపల్ కమిషనర్ బదిలీ

వైరా, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపల్ కమిషనర్ చింతా వేణు బదిలీ అయ్యారు. రాష్ట్రంలో మూకుమ్మడిగా 47మంది మునిసిపల్ కమిషనర్ల బదిలీలు జరిగాయి. 2024 ఫిబ్రవరి నుంచి వేణు ఇప్పటివరకు కమిషనర్‌గా పనిచేశారు. ఆయన్ని ఉమ్మడి నల్గొండ జిల్లా నందికొండ మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. నందికొండ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న గురిలింగం వైరా మునిసిపల్ కమిషనర్‌గా బదిలీపై రానున్నారు. ఆమేరకు ప్రభుత్వ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

‘ఫుడ్‌పాయిజన్’పై విచారణ జరిపించాలి

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఇటీవల జరిగిన ఫుడ్ పాయిజన్‌పై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ అభివృద్ధి సొసైటీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన గంగారంలో మాట్లాడుతూ.. వార్డెన్, వంట మనుషుల నిర్లక్ష్యం మూలంగా పిల్లలు అనారోగ్యం బారిన పడ్డారని, స్థానిక అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని హాస్టల్ విజిట్ చేసి భోజనాన్ని రుచిచూడడంతో పాటు వారితో కలిసి ఒక్క రోజు నిద్రచేసి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని కోరారు. మోదుగు రాంబాబు, ఊకే మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల నివారణకు చర్యలు చేపట్టాలి

» మధిర సహాయ వ్యవసాయ సంచాలకుడు విజయచంద్ర

బోనకల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటలో గులాబి పురుగు నివారణ కోసం రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మధిర సహాయ వ్యవసాయ సంచాలకుడు స్వర్ణ విజయచంద్ర కోరారు. బోనకల్ రైతు వేదికలో గురువారం ఎల్‌డీసీ మరియు కేవై ఆర్టీ సంయుక్త ఆధ్వర్యంలో పత్తిలో గులాబి పురుగు నివారణ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి వేసిన 45 రోజుల తరువాత గులాబి రంగు పురుగు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు గమనించాలని సూచించారు. ఎల్‌డీసీ ప్రతినిధి మధుసూదన్‌రావు, కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సుచరితదేవి, ఏవో పసనూరి వినయ్ కుమార్, శాస్త్రవేత్తలు పావని, ఫణిశ్రీ, సరస్వతి తదితరలు పాల్గొన్నారు.

జ్వరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

» జిల్లా వైద్యాధికారి కళావతిబాయి

చింతకాని, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు, జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి కళావతిబాయి సూచించారు. గురువారం మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో ఆమె పర్యటించారు. ఆరోగ్య ఉప కేంద్రంలో రికార్డులు పరిశీలించి, ఆశాలతో గ్రామంలో ప్రజారోగ్య విషయాలపై మాట్లాడారు. అనంతరం గ్రామంలో పర్యటించి పారిశుద్య కార్యక్రమాలను పరిశీలించారు. నీళ్లు నిల్వ ఉన్న చోట, మురుగు ప్రదేశాల్లో లార్వాను అభివృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మండల వైద్యాధికారి అల్తాఫ్ పాల్గొన్నారు.

28న బ్రహ్మకుమారీల రక్తదాన శిబిరం

సత్తుపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28న స్థానిక జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సోషల్ సర్వీస్ వింగ్ బాధ్యులు తెలిపారు. గురువారం సత్తుపల్లిలో నిర్వహించిన సమావేశంలో బ్రహ్మకుమారీస్ మాట్లాడుతూ బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సొసైటీ మాజీ ముఖ్య కార్య నిర్వహకురాలు దాదీప్రకాష్ మణి 18వ స్మృతిదినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10గంటలకు కళాశాలలో జరిగే ఈ కార్యక్రమానికి తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

జీతాల కోసం ఫీల్డ్‌అసిస్టెంట్ల వినతి

కొణిజర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు నెలలు నుంచి తమకు జీతాలు రావడంలేదని, జీతాలు ఇప్పించాలని కోరుతూ మండల ఫీల్డ్‌అసిస్టెంట్‌లు గురువారం ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. జీతాలు రాక తీవ్రఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కష్టాన్ని అర్థం చేసుకోని జీతాలు ఇవ్వాలని కోరారు.

ఆశల సాగు వర్షం పాలు

చింతకాని, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మెట్ట పంటలు సాగు చేసిన రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కోతకొచ్చిన పెసర నూర్పిడి చేసే పరిస్థితి లేకపోవడంతోపాటు గింజలు బూజు పడుతుండడం, అధిక వర్షాలకు పత్తి పంటలో నీళ్లు నిలిచి ఉన్న పూత రాలిపోయి ఎదుగుదల లోపించడంతో రైతులు కలవరపాటుకు లోనవుతున్నారు. కురిస్తే ఏకదాటి వాన లేకపోతే రోజుల తరబడి ఎండ లాంటి వాతావరణం పంటల దిగుబడులపై ప్రభావం చూపుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలిస్తుందని ఎన్నో ఆశలతో వంటల సాగు చేపట్టిన రైతులకు ఆదిలోనే ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నారు.



కోతకొచ్చిన పెసర పంట

గతేడాది కంటే పెరిగిస సాగు విస్తీర్ణం

మండల వ్యాప్తంగా సుమారు 6 వేల ఎకరాల్లో రైతులు పెసర సాగు చేపట్టారు. పత్తి పంటలపై చీడపీడల దాడి, దిగుబడులు తగ్గడంతోపాటు పెట్టుబడులు, కూలీల ఖర్చులు అధికమవ్వడంతో మండల రైతులు పెసర సాగుకు మొగ్గు చూపారు. సాగర్ ఆయకట్టుతో పాటు బావులు, బోర్లు ఉన్న రైతులు వానాకాలం పెసర సాగు వల్ల పంట రెండు నెలల్లోనే చేతికొచ్చి యాసంగి మొక్కజొన్న త్వరగా సాగు చేసుకోనే అవకాశం ఉండడంతో పెసర సాగును అధికంగా చేపట్టారు.

లక్షల్లో నష్టపోయిన రైతులు

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పెసర పంట చేతికొచ్చే పరిస్థితి కనపడడంలేదు. మండల వ్యాప్తంగా సుమారు 6 వేల ఎకరాల్లో పెసర సాగు చేయగా ప్రస్తుతం కోత దశకు చేరుకుంది. ఎకరాకు రూ.5 వేల నుంచి 10 వేల వరకు దుక్కులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కలుపుతీతకు పెట్టుబడి రూపంలో పెట్టారు. గత వారం వరకు వాతావరణం అనుకూలించడంతో ఎకరాకు మూడు నుంచి ఐదు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని భావించారు. పంట కోతకు వచ్చిన తరుణంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కాయల్లోని విత్తనాలు మొలకెత్తాయి. మరికొన్ని బూజు పట్టి గింజ రంగుమారి నల్లగా మారాయి.

హార్వెస్టర్‌తో నూర్పిడి చేసే అవకాశం లేదు

రైతు కొల్లి గోపాలరావు, నేరడ



నాకున్న ఐదు ఎకరాలతోపాటు మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని పెసర పంట సాగు చేశాను. 15 ఎకరాలు కోత దశకు వచ్చింది. పది రోజులుగా వర్షం వస్తుండటంతో హార్వెస్టర్‌తో నూర్పిడి చేసే అవకాశం లేకుండా పోయింది. మరో రెండు రోజులైతే గింజలు పూర్తిగా పాడయ్యే అవకాశం ఉంది. ఎకరాకు రూ 30 వేల చొప్పున 15 ఎకరాలకు రూ 4.50 లక్షలు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

లింగాకర్ష బుట్టలతో గులాబీ రంగు పురుగు నివారణ

చింతకాని, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పత్తిలో లింగాకర్ష బుట్టల ఏర్పాటుతో గులాబి రంగు పురుగు ఉధృతిని తగ్గించవచ్చునని మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఎల్‌డీసీ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పత్తి విత్తిన 45 రోజుల నుంచి గులాబీ ఆశిస్తుందన్నారు. లింగాకర్ష బుట్టల ఏర్పాటుతో తల్లి పురుగును గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎల్‌డీసీ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా లింగాకర్ష బుట్టల కిట్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో సోములపల్లి మానస, ఎల్‌డీసీ కంపెనీ ప్రతినిధి మధుసూధన్‌రావు, ఆత్మ కమిటీ సభ్యులు తోటకూరి ప్రగతి, ఏఈవోలు తేజ, ఆయేషా, తహీయా, రాము, కళ్యాణి, కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

తొలగనున్న విద్యుత్ సమస్యలు

» తిమ్మారావుపేటకు సబ్ డివిజన్ కార్యాలయం

ఏన్కూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరావుపేటలో టీజీఎన్పీడీసీఎల్ సబ్‌డివిజన్ కార్యాలయంతోపాటు (ఈఆర్‌వో) విద్యుత్ రెవెన్యూ కేంద్రం ఏర్పాటుకు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. వీటితో పాటు కొత్తగా బురదరాఘవాపురం గ్రామానికి సబ్‌స్టేషన్ మంజూరయింది. దీంతో మండలంలోని విద్యుత్ సమస్యల పరిష్కారం కానున్నాయి. మండలంలోని9వేల గృహ అవసరాల సర్వీస్ మీటర్లు,4950 వ్యవసాయ విద్యుత్ మోటార్లు ఉన్నాయి. దీంతో లోడ్‌పెరిగి తరుచూ విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతోంది. మండలంలో అధికంగా సుబాబుల్ తోటలు ఎక్కువగా ఉండడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు ఏన్కూరు, కారేపల్లి మండలాలను కలుపుతూ తిమ్మరావుపేటలో సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. తిమ్మరావుపేట సెక్షన్ కింద జన్నారం, తిమ్మరావుపేట సబ్‌స్టేషన్‌లో పరిధిలోని జన్నారం, శ్రీరామగిరి, లచ్చగూడెం, కోనాయపాలెం, నూకాలంపాడు, బురదరాఘవాపురం, పీకే బంజర, రాజలింగాల, తిమ్మరావుపేట, రంగాపురం, మూలపోచారం, సూర్యతండా, రాయమాధారం గ్రామాలున్నాయి. ఏన్కూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఏన్కూరు, నాచారం, సబ్‌స్టేషన్లున్నాయి. వీటి పరిధిలో టీఎల్‌పేట, గార్లొడ్డు, కేసుపల్లి, హిమాంనగర్, బీఎన్‌దతండా, అక్కినాపురంతండా, బద్రతండా, రామతండా, నాచారం, మేడేపల్లి, గంగుల నాచారం, రాజులపాలెం, మూన్యతండా గ్రామాలతో సెక్షన్లు ఏర్పాటుక ప్రతిపాదనలు పంపారు.

వీర జవాన్ కుటుంబానికి రూ.లక్ష సాయం

కారేపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్వావాన్ హైస్కూల్‌కు చెందిన 2009ఎస్ఎస్‌సీ బ్యాచ్ మిత్రులు ఆర్మీ అమర్ జవాన్ అనిల్ కుమార్ పేరుతో స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా జమ చేశారు. ఈ సందర్భంగా అనిల్ స్నేహితులు భావోద్వేగంతో మాట్లాడుతూ.. అనిల్ తమకు స్నేహితుడు మాత్రమే కాదని అన్నయ్యలాంటి వాడన్నారు. అనిల్ త్యాగం వల్లే అందరం సరిక్షతంగా ఉన్నామన్నారు. తాము చేసిన చిన్నసహాయంద్వారా అనిల్ కుటుంబం పక్కన నిలబడ్డామన్న గొవరం దక్కిందన్నారు. అనిల్ ధైర్యం ఎల్లప్పుడూ విద్వావాన్ హైస్కూల్ విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. నాటి స్నేహితుల ఉదార మానవీయ ఆర్థిక సాయంపై గ్రామస్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు. వీరజవాన్ల త్యాగానికి ఇటువంటి సహాయాలే నిజమైన గౌరవమని, యువతకు ఇది ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మిత్రులందరు కలిసికట్టుగా వచ్చి అనిల్ కుటంబ సభ్యులకు తామంత అండగుంటామని భరోసకల్పించారు.



అనిల్ కుటుంబసభ్యులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చెక్కును అందిస్తున్న నాటి స్నేహితులు

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

మధిరరూరల్/బోనకల్/కారేపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గణేష్ మండపాలను ఏర్పాటు చేయాలనుకునేవారు ముందుగానే పోలీసుశాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ మధు స్పష్టం చేశారు. మండపం ఏర్పాటుచేసే స్థలదాత అంగీకార పత్రం, విద్యుత్‌శాఖ అనుమతి పత్రాలు తప్పనిసరిగా పోలీసు శాఖకు సమర్పించాలని సూచించారు. వినాయక మండపాల వద్ద డీజే సౌండ్‌కు అనుమతి లేదన్నారు. ప్రజలంతా నియమనిబంధనలను గౌరవిస్తూ పోలీసుశాఖను సంప్రదించి మాత్రమే మండపాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ స్థలాల్లో విగ్రహాలను పెడితే తప్పని సరిగా పంచాయతీల నుంచి అనుమతి తీసుకోవాలని బోనకల్ ఎస్ఐ పొదిలి వెంకన్న కోరారు. విద్యుత్‌శాఖ అనుమతితోపాటు, వినాయక మండపాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కారేపల్లి ఎస్ఐ గోపి సూచించారు.



సీఐ మధు

ఆరోగ్యానికి పరిశుభ్రతే ముఖ్యం

» సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, మంచి ఆరోగ్యానికి పరిశుభ్రతే ముఖ్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి మార్నింగ్ వాక్‌లో భాగంగా పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ 8,9వార్డులలో ఆమె పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని కమిషనర్ కె.నరసింహ, జేవీఆర్ ఓసీ పీవో ఎన్‌వీఎస్.ప్రహ్లాద్‌లను సూచించారు. కాలనీలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రూ.55.37లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 28మందికి మంజూరైన రూ.9,88,500విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మునిసిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్‌లను ఆమె చేతులమీదుగా పంపిణీ చేసి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో బాధ్యతగా ఉండాలని సూచించారు. అదేవిధంగా పాతసెంటర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 752మంది విద్యార్థినీలకు కోడ్ హోప్ గ్లోబల్, సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీల ఆధ్వర్యంలో శానిటరీ న్యాప్కిన్స్‌ను ఉచితంగా అందజేశారు. ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, సంస్థ బాధ్యులు ఎం.నరసింహారావు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రెయిన్‌కోట్స్ అందిస్తున్న ఎమ్మెల్యే

రెండు వారాలకు మించి దగ్గు ఉంటే పరీక్షలు తప్పనిసరి

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బరువు తగ్గడంతోపాటు రెండు వారాలకు మించి దగ్గు వస్తే టీబీ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ స్పందన సూచించారు. గురువారం గంగారంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో టీబీ వ్యాధిపై వైద్యారోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. టీబీ లక్షణాలు ఉన్నట్లయితే పిల్లలకు వెంటనే పరీక్షలు చేయించి పూర్తిగా కోలుకునేవరకు వైద్యం చేయించుకోవాలని చెప్పారు. టీబీ అలర్ట్ ఇండియా జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కే.ప్రభాకర్, డీఎస్ఎం శివకుమారి, డాక్టర్ ఖాసీం, సూపర్‌వైజర్లు విజయకుమారి, శారారాణి, వెంకటేశ్వర్లు, రామారావు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎమ్‌లు పాల్గొన్నారు.

యూరియా సరఫరా కేంద్రాలు పెంచాలి

» తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

కొణిజర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కొణిజర్లలోని గోపవరం సొసైటీ పరిధిలో యూరియా సరఫరా కేంద్రాలు పెంచాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం రైతుసంఘం ఆధ్వర్యంలో సొసైటీ వద్దకు వచ్చి రైతులు, రైతు సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గోపవరం సొసైటీ పెద్దసొసైటీగా ఉందని, మండలానికి ఒకే సొసైటీ ఉండడం వల్ల వందల మంది రైతులు సొసైటీ ముందు క్యూలో నిలబడి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బయోమెట్రిక్ విధానం వల్ల రైతుల వేలిముద్రలు పడక చాలా మంది రైతులు నిరాశతో వెనుతిరిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుసంఘం రాష్ట్రకమిటి సభ్యులు చింతనిప్పు చలపతిరావు, సొసైటీ డైరక్టర్ సంక్రాంతి నర్సయ్య, రైతుసంఘం మండల కార్యదర్శి ఎర్రమల మాదవరెడ్డి, అనుమోలు కృష్ణయ్య, ఉపేందర్, నరసింహరావు, నరేష్ పాల్గొన్నారు.



ఏవోతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

సొసైటీ ఆధ్వర్యంలో ఎరువుల విక్రయం

చింతకాని, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామంలో చింతకాని సొసైటీ ఆధ్వర్యంలో ఎరువుల విక్రయ కేంద్రాన్ని సొసైటీ ఛైర్మన్ కొండపల్లి శేఖరొరెడ్డి, మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర గురువారం ప్రారంభించారు. రైతుల అవసరాన్ని దృష్టిలో చింతకాని సొసైటీ ఆధ్వర్యంలో నాగిలిగొండ గ్రామంలో అదనంగా ఎరువుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఏవో మానస, సీఈవో శ్రీనివాసరావు, మద్దిన్ని రవి, గడ్డం శ్రీను, సీతయ్య పాల్గొన్నారు.

యూరియా పంపిణీని పరిశీలించిన ఏవో

వైరా, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపాడు, వైరా సొసైటీ పరిధిలోని సిరిపురంలో గురువారం యూరియా పంపిణీని మండల వ్యవసాయశాఖ అధికారి మయాన్ మంజూఖాన్ పరిశీలించారు. యూరియా పంపిణీ కేంద్రాల వద్ద రైతులతో ఏవో మాట్లాడుతూ.. వ్యవసాయ అవసరాలకు సరిపడా యూరియా అందిస్తామని, ఎలాంటి కొరత లేదని, అవసరాల మేరకే వినియోగించుకోవాలని సూచించారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించే డీలర్ల లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఏఈవోలు దీప్తి, సైదులు, సొసైటీల నిర్వాహకులు అక్కిశెట్టి రామకృష్ణ, నారపోగు నాగరాజు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా అందించాలి: ఎస్ఐ

వేంసూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యూరియాను అందించాలని మండల వ్యవసాయ అధికారి రామ్మోహన్‌రావు, ఎస్ఐ కవిత సూచించారు. గురువారం వేంసూరు రైతు వేదికలో ఎరువుల డీలర్లు, సొసైటీ సీఈవోలు, ఆగ్రోస్, గ్రోమోర్ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. డీలర్లు యూరియాకు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు హెచ్చరించారు. ఎస్బీ ఏఎస్ఐ శ్రీనివాసరావు, దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

గురుకులాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్

వైరా, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వైరాలో బీసీ గురుకుల బాలికల పాఠశాలను గురువారం తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఈ గురుకులంలోని బియ్యం, కోడిగుడ్లు, నూనె ప్యాకెట్లు ఇతర సరుకులను పరిశీలించారు. ఆ తర్వాత విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ప్రిన్సిపల్ పి.రాధిక, ఇంటిలిజెన్సీ ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి: డీపీవో

ముదిగొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. ముదిగొండ మండలంలోని పండ్రేగుపల్లి, ఖానాపురం, న్యూలక్ష్మీపురం గ్రామాల్లో గురువారం పర్యటించి పారిశుద్య కార్యక్రమాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. వర్షాలకు గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్ స్వామి, ఎంపీవో వాల్మీకి కిషోర్, గృహనిర్మాణశాఖ ఏఈ సతీష్, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన

మధిర రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం దేశినేనిపాలెం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి గురువారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ శంకుస్థాపన చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కృషితో ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అద్దంకి రవికుమార్, చిలివేరు బుచ్చిరామయ్య, కర్నాటి రామారావు, బిట్రా ఉద్దండయ్య, ఆవుల ఝాన్సీ కిరణ్‌కుమార్, ఆవుల శ్రీనివాసరావు, ఆవుల రవి, సంగయ్య పాల్గొన్నారు.

ఎంఆర్సీలో విద్యార్థుల ఆధార్ నమోదు కేంద్రం

బోనకల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఆధార్ లేని విద్యార్థుల కోసం స్థానిక ఎంఆర్సీలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాన్ని గురువారం ఎంఈవో దామాల పుల్లయ్య పరిశీలించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులందరికి ఆధార్ కార్డులు ఇచ్చేందుకు గానూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు వైరా నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

వైరా, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గంలో శుక్రవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని క్యాంపు కార్యాలయం తెలిపింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఎమ్మెల్యే నిర్వహిస్తారని పేర్కొంది. జూలూరుపాడ్ మండలం పడమటి నర్సాపురంలో, ఏన్కూరు మండలం భద్రుతండా, కారేపల్లి మండలం గాదెపాడు, వైరా మండలంలోని విప్పలమడక, కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యాలయాలు, సీసీ రోడ్ల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని వివరించారు. ఈ పర్యటనలను జయప్రదం చేయాలని వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి కోరారు.

విలువలతో కూడిన విద్య అందించడమే విజయ కాలేజీ లక్ష్యం

» కళాశాల ఛైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్

కొణిజర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉన్నతమైన, విలువలతో కూడిన విద్యను అందించడమే తమ విజయ ఇంజనీరింగ్ కళాశాల లక్ష్యమని కళాశాల ఛైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఓరియెంటేషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యతు కోసం అవసరమైన అన్ని వనరులను సమకూర్చుతూ ఉత్తమ మార్గదర్శకత్వాలను అందిస్తామన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను తెలుసుకుని క్రమశిక్షణతో చదువుకోవాలని, తల్లిదండ్రులకు, కళాశాలకు మంచిపేరుతీసుకరావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ఛైర్మన్ పారుపల్లి విజయలక్ష్మీ, ప్రిన్సిపాల్ చిన్నయ్య, వైస్‌ప్రిన్సిపాల్ అయేషాతరుణం, డీన్ శ్రీనివాస్, ఏవో ఫరీద్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత



పాఠశాలకు ఇన్వెటర్‌ను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కొణిజర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1989-1994 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ. 20వేలు విలువ చేసే ఇన్వేటర్, బ్యాటరీని గురువారం అందించారు. తమ స్నేహితురాల్లో ఒకరు అనారోగ్యంతో బాధపుతున్నారని తెలుసుకొని ఆమెకు రూ. 25వేలును ఆర్థికసహాయంగా అందించి స్నేహాన్ని చాటుకున్నారు. ఇలానే పాఠశాల అభివృద్ధికి తోడ్పాతామని పూర్వవిద్యార్థులు తెలిపారు. పూర్వ విద్యార్థుల సమాజికసేవను చూసి ఉపాధ్యాయులు అభినందించారు.

అభివృద్ధికి ఐక్యత అవసరం: మాల మహానాడు

సత్తుపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మాలల అభివృద్ధికి ఐక్యత అవసరం, సంఘబలంతో హక్కులను సాధించుకుంటూ సమాజంలో ఎదగాలని మాలమహానాడు బాధ్యులు అన్నారు. జిల్లా ఉత్తమ లైబ్రేరియన్ నక్కా రాజేశ్వరరావు, సత్తుపల్లి ప్రెస్‌క్లబ్ వైస్ ఛైర్మన్ యనమాల విజయ్‌లను గురువారం సత్తుపల్లిలో మాల మహానాడు బాధ్యులు ఘనంగా సన్మానించారు. ప్రతిఒక్కరూ ఐక్యతగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, విభేదాలు, విభజనలు అభివృద్ధికి ఆటంకమని, కలిసికట్టుగా ఉంటూ మన అభ్యున్నతికి తోడ్పాటును అందించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, నాయకులు పిల్లి మల్లికార్జున్, పిల్లి సురేష్, కోపల్లి రత్తయ్య, కోండ్రు మోషె, సుకబోగి రాము, బల్లెం చిరంజీవి, వేము సురేష్, పూరేటి వెంకటేశ్వరరావు, బూరుగు భాస్కరరావు, నక్కా మోహనరావు, సాలి పవన్, గుంట్రు సూర్య, అరుణ్‌కుమార్, ఈదుల రమేష్, వేల్పుల ఆనంద్, కటుకూరి కృష్ణ, మైఖేల్ కోండ్రు మోహన్‌రావు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో సన్మానిస్తున్న బాధ్యులు

సత్యనారాయణకు సండ్ర నివాళి

మధిర రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మల్లారం గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు స్వర్గీయ కూరపాటి సత్యనారాయణకు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ నివాళులర్పించారు. గురువారం మల్లారం గ్రామంలో జరిగిన సత్యనారాయణ సంస్కరణ కార్యక్రమానికి వారు హాజరై కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ డీసీసీబీ ఉపాధ్యక్షులు ఉమ్మినేని కోటయ్య, తాతా భాస్కర్, ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మండల అధ్యక్షుడు పుల్లారావు పాల్గొన్నారు.

వేడిగా వండిన ఆహారాన్ని వడ్డించాలి

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాలలో విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం వేడిగా వండిన ఆహారాన్ని వడ్డించాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ ఆదేశించారు. సత్తుపల్లిలోని ఎస్టీ బాలుర, బాలికల పీహెచ్‌ఎంలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా వసతి గృహాలలోని డార్మెటరీ, వంట గదులు, సామాన్లు భద్రపరిచే స్టోర్‌రూమ్‌లు, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి వార్డెన్లు బీ.రాములు, మాధవిలకు పలు సూచనలు చేశారు. ఇటీవల భద్రాచలం గురుకులం, కల్లూరు ఆశ్రమ పాఠశాలలో ఆహారం సరిగా లేనందున పిల్లలు అస్వస్థతకు గురైన విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని అన్నారు. జీసీసీ ద్వారా సరఫరా చేసే నిత్యవసర సరుకులను పూర్తిస్థాయిలో చెక్ చేసుకున్న తర్వాతనే తీసుకోవాలని, డేట్ ముగిసిపోయిన ఆహార సామాగ్రి ఏమైనా ఉంటే వెంటనే తీసివేయాలన్నారు. స్టోర్‌రూమ్‌లో నాసిరకం సరుకులు కొన్ని ఉండటంతో స్టోర్‌లోని సరుకుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వార్డెన్‌కు సూచించారు. ప్రతిరోజూ వంటగదిని శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వంట చేసే వర్కర్లు పరిశుభ్రతను పాటించాలని చెప్పారు. విద్యార్థులు ప్రతిరోజూ చదివే సబ్జెక్టులతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు చదివి పరీక్షలు బాగా రాసేలా చూడాలని, వారు ఏ రంగంలో రాణించాలని కోరుకుంటున్నారో ముందే తెలుసుకుని అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని వార్డెన్లను ఆదేశించారు.



వార్డెన్లకు సూచనలిస్తున్న పీవో రాహుల్